# ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

సంపుటి: 02 | సంచిక: 09 | ఎడిటర్: మేనం శ్యామ్ | మంగళవారం 28-07-2026 | పేజీలు: 10


## సిరా చుక్క

జిర్రపురుగులే (లు)
"హిట్"కొట్టినవా !
విధ్యార్థుల హత్యలు, ఆత్మహత్యలు
కాకముందే ప్రభుత్వమే"హిట్" కొట్టిందా ?
రెండోదే నిజం.
మొండి తనం చూపకుండా తగ్గడమే "నిజం".
నైతిక భాధ్యత పదవుల విలువలు పెంచాలి.
కేంధ్రమే రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండాలి.
(ఉపోద్గాతం ఆపేద్దాం.)
దొంగలు పడ్డ నాలుగు నెల్లకు
కుక్కలు మొరిగినవి.
మల్లా "నీట్" పరీక్షలు జరిగినవి
పలితాలు వచ్చినవి.
ఇన్నాల్లు వీల్లంతా ఏ దొడ్డిలో పన్నట్టు.
లోకల్ ప్రతి పక్షంతో సహ పేపర్ "లీక్"లేని
ప్రభుత్వం దేశంలో ఒక్కటైనా ఉన్నదా !
విధ్యార్థుల ఏడిపించని
ప్రభుత్వాలు ఇక ముందైనా వచ్చునా ?
కొందరు విధ్యార్థుల మాటున జనం
"చీ"కొట్టిన నాయకులు"పత్తిత్తు" పార్టీలు
ఉగ్రవాదులు తీవ్రవాదులు సంఘ విద్రోహ శక్తులు
పక్క దేశాల తొత్తులు
(కేంధ్ర మంత్రి రాజీనామా చేయకుంటే)
పకడ్బందీ వ్యూహంతో వచ్చినాయి.
వెంట సామాగ్రి తెచ్చినాయి. "నీట్" కు
భారత్ మాతకుసంబందం ఉందా ?
"నీట్"కు శ్రీ రాముడికి సంబందం ఉందా ?
"నీట్"కు అల్లాకు సంబందం ఉందా ?
సంబందం లేని దర్నాలో ఇన్ని విషయాలు
ఎందుకున్నవి.
భారత మాత బొమ్మ గీసి "భారత మాత"ను
సమూహిక హత్యాచారం చేస్తున్న
మ(త)ద పిచ్చిగాల్ల వీడియో
మీ ముందున్నది చూడండి.
కారణం లేక కొట్టుక చస్తున్న
చిల్లర నాయకులు పన్నిన వ్యూహం ఇది.
మనలో మనకు ఎన్ని ఉన్న
దేశ ప్రతిష్ట దిగజార్చే వెదవలు
ముమ్మాటికి దేశ ద్రోహులు.
మతాలకు పార్టీలకు అతీతంగా
దేశాన్ని ప్రేమిద్దాం.
దేశద్రోహుల తన్ని తరిమేద్దాం.

– రాజి రెడ్డి శీలం ..
ఇనుగుర్తి...

## విద్యా వ్యవస్థను కుదేలు చేసింది రేవంత్ ప్రభుత్వమే



- సీఎం రాజీనామా చేయాలి: రాంచందర్ రావు
- విద్యాశాఖలో పూర్తిగా విఫలమైన సీఎం నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలి
- కనీస వయస్సు తగ్గింపు ప్రతిపాదన డైవర్షన్ పాలిటిక్స్ మాత్రమే
- రూ.12,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- 17 ప్రభుత్వ యూనివర్సిటీలు నిధుల కొరతతో సంక్షోభంలో ఉన్నాయి
- యువతకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది
- విద్యాశాఖ బాధ్యతలను యువ ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డికి అప్పగించాలని సూచన

2 లో

## పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించిన కేసీఆర్..



- ఏం చేసినా కాపాడండి అంటూ వైద్యులకు విజ్ఞప్తి
- యశోద ఆస్పత్రిలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించిన కేసీఆర్
- వైద్యులతో అరగంట పాటు చర్చించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- "ఏం చేసినా పెద్ది సుదర్శన్ రెడ్డిని కాపాడండి" అంటూ వైద్యులకు భావోద్వేగ విజ్ఞప్తి.
- మరో 48 గంటలు అత్యంత కీలకమని వెల్లడించిన వైద్యులు
- చికిత్స ఖర్చుకు వెనుకాడబోమని, పార్టీ అండగా ఉంటుందని కేసీఆర్ భరోసా


2 లో

## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు సీరియస్

- వెంటనే తప్పించాలని సంచలన ఆదేశాలు
- రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ పదవి నుంచి తప్పించాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- కోర్టు ఆదేశాలు అమలు చేయ కపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం
- హైడ్రా పరిధి దాటి ప్రైవేట్ భూముల వ్యవహారాల్లో జోక్యంపై అభ్యంతరం
- రంగనాథ్ స్థానంలో ఐజీ స్థాయి అధికారిని నియమిం చాలని స్పష్టమైన ఆదేశాలు
- 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై వివరణ కోరిన హైకోర్టు.

2 లో





కలెక్టర్ గారూ.. స్పందించండి
మేడ్చల్ జిల్లా కలెక్టర్ వెంటనే ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత మహిళకు తక్షణమే న్యాయం చేయాలని ప్రజా వాయిస్ డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించాల్సిన అధికారులు ప్రజలను ప్రైవేట్ వ్యక్తుల వద్దకు పంపించడం ఎంతవరకు సమంజసమో ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

# మేడ్చల్ జిల్లా కలెక్టర్ సార్.. మీరే మాకు దిక్కు!

- ప్రజా వాయిస్ స్టింగ్ ఆపరేషన్‌లో ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం
- ప్రైవేట్ సర్వేయర్ల దందా బట్టబయలు
- ఎంఆర్వో, ఆర్డీవో చెప్పినా సిబ్బంది లో చలనం లేదు

**మేడ్చల్, ప్రజా వాయిస్:** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఇరిగేషన్ శాఖ అధికారుల నిర్లక్ష్యం, ప్రైవేట్ సర్వేయర్లకు ప్రభుత్వ పనులను మళ్లిస్తున్న వ్యవహారం ప్రజా వాయిస్ నిర్వహించిన స్టింగ్ ఆపరేషన్‌లో వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ ప్రజలకు సేవలు అందించాల్సిన అధికారులు.. బాధితులను నెలల తరబడి తిప్పలు పెట్టి, చివరకు ప్రైవేట్ సర్వేయర్ల వద్దకు పంపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.


**10 నెలలుగా సర్వే కోసం ఎదురుచూపులు**

నాగారం మున్సిపల్ పరిధిలో 300 గజాల స్థలం కలిగిన ఓ మహిళ 2025 సెప్టెంబర్ 25న ఎల్ఆర్ఎస్ (LRS) కోసం దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం ఇరిగేషన్ శాఖ సంబంధిత సర్వేయర్‌కు సర్వే నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. నిబంధనల ప్రకారం 15 రోజుల్లో సర్వే పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ.. దాదాపు 10 నెలలు గడిచినా అధికారులు సర్వే చేయలేదు. ఈ క్రమంలో ఒకసారి అధికారుల వద్ద ఫైల్ కూడా పోయిందని, బాధితురాలు మరోసారి అన్ని పత్రాల జిరాక్స్ కాపీలు సమర్పించినప్పటికీ ఎలాంటి పురోగతి లేదని వెల్లడైంది.

**ఎంఆర్వో, ఆర్డీవో చెప్పినా స్పందన లేదు**

న్యాయం కోసం తిరిగి తిరిగి విసిగిపోయిన బాధితురాలు గత వారం ప్రజా వాయిస్‌ను ఆశ్రయించారు. బాధిత కుటుంబ సభ్యుల తరపున ప్రజా వాయిస్ ప్రతినిధి కీసర ఎంఆర్వోను కలిసి సమస్య వివరించారు. ఎంఆర్వో అధికారులకు సూచనలు చేసినప్పటికీ సర్వేయర్, ఇరిగేషన్ సిబ్బందిలో ఎలాంటి స్పందన కనిపించలేదు.వారం రోజుల తర్వాత బాధితురాలిని ఆర్డీవో వద్దకు తీసుకెళ్లి మరోసారి న్యాయం చేయాలని కోరినా పరిస్థితిలో మార్పు రాలేదు.

**స్టింగ్ ఆపరేషన్‌లో బయటపడిన అసలు బాగోతం**



ప్రజా వాయిస్ ప్రతినిధి స్వయంగా సంబంధిత సర్వేయర్, ఇరిగేషన్ అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించి సర్వే ఎందుకు చేయడం లేదని ప్రశ్నించగా.. వారు ప్రభుత్వ సర్వే చేయకుండా ప్రైవేట్ సర్వేయర్ల ఫోన్ నంబర్లు ఇస్తూ, "మీరు ప్రైవేట్‌గా సర్వే చేయించుకోండి" అని సూచించినట్లు స్టింగ్ ఆపరేషన్‌లో బయటపడింది.ప్రభుత్వంలో సర్వేయర్లు ఉన్నప్పటికీ, ప్రజలను ప్రైవేట్ సర్వేయర్ల వద్దకు మళ్లించడం వెనుక అక్రమ లావాదేవీలు జరుగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ సర్వేయర్లు ప్రైవేట్ సర్వేయర్లకు పనులు అప్పగించి, వారి నుంచి లాభాలు పొందుతున్నారనే విశ్వసనీయ సమాచారం కూడా వెలుగులోకి వచ్చింది.

**బాధితులకు న్యాయం ఎప్పుడు?**

ఎంఆర్వో, ఆర్డీవో వంటి రెవెన్యూ ఉన్నతాధికారులు సూచించినా సర్వే చేయని పరిస్థితి ఉంటే.. సామాన్య ప్రజలు ఎవరిని ఆశ్రయించాలి? 15 రోజుల్లో పూర్తి కావాల్సిన సర్వే 10 నెలలు గడిచినా పూర్తి కాకపోవడానికి కారణం ఏమిటి? ఇది అధికారుల పనిభారమా? లేక ఉద్దేశపూర్వక కాలయాపన చేసి ప్రైవేట్ సర్వేయర్లకు లాభం చేకూర్చే ప్రయత్నమా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

## జంతర్‌మంతర్ నిరసనలపై కొండా విశ్వేశ్వర్ రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు

- జెన్‌జీ, సీజేపీ ఉద్యమం విదేశీ నిధులతో నడుస్తోందని ఆరోపణ
- నిరసనల్లో రోహింగ్యాలు, ఖలిస్తాన్ మద్దతుదారులు పాల్గొన్నారన్న బీజేపీ ఎంపీ
- పార్లమెంట్ వైపు దూసుకెళ్లడంతోనే పోలీసులు లాఠీచార్జ్ చేశారని వ్యాఖ్య
- అమెరికా వంటి దేశాల్లో అయితే కాల్పులు కూడా జరిగేవని వివాదాస్పద వ్యాఖ్యలు
- విద్యార్థులను రెచ్చగొట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

2 లో

# నీట్ పరీక్షల సంస్కరణలకు కేంద్రం కీలక కమిటీ

- నందన్ నీలేకణి నుంచి కామకోటి వరకు ఎవరు?
- నీట్ పరీక్షల్లో సంస్కరణలకు ఆరుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు
- కమిటీ ఛైర్మన్‌గా ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకణి
- ఇస్రో మాజీ ఛైర్మన్ ఎస్. సోమనాథ్, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ కామకోటి సభ్యులు
- పరీక్షల భద్రత, డిజిటల్ వ్యవస్థ, లీకేజీల నివారణపై సిఫార్సులు చేయనున్న కమిటీ
- కామకోటి గత వ్యాఖ్యల నేపథ్యంలో కమిటీపై రాజకీయ, సామాజిక చర్చ.





**న్యూఢిల్లీ, ప్రజా వాయిస్:** నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనల నేపథ్యంలో జాతీయ పరీక్షా వ్యవస్థలో సమూల సంస్కరణలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఆరుగురు సభ్యులతో కూడిన ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ పరీక్షల నిర్వహణ, భద్రత, డిజిటల్ వ్యవస్థ, ప్రశ్నపత్రాల రక్షణ, లీకేజీల నివారణ వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి కీలక సిఫార్సులు చేయనుంది.

**నందన్ నీలేకణికి కమిటీ బాధ్యతలు**

కమిటీకి ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు, ఆధార్ (యూఐడీఏఐ) తొలి ఛైర్మన్ నందన్ నీలేకణిని ఛైర్మన్‌గా నియమించారు. దేశంలో అతిపెద్ద డిజిటల్ గుర్తింపు వ్యవస్థను విజయవంతంగా అమలు చేసిన అనుభవంతో పరీక్షల నిర్వహణలో సాంకేతిక భద్రతను మరింత పటిష్టం చేసే బాధ్యతలను ఆయన నిర్వర్తించనున్నారు.

**సాంకేతిక భద్రతకు సోమనాథ్**

ఇస్రో మాజీ ఛైర్మన్ ఎస్. సోమనాథ్ కూడా ఈ కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. చంద్రయాన్–3, ఆదిత్య ఎల్–1 వంటి కీలక అంతరిక్ష మిషన్లకు నాయకత్వం వహించిన ఆయన.. పరీక్షల నిర్వహణలో సురక్షితమైన, లోపాలకు తావులేని వ్యవస్థలను రూపొందించేందుకు తన అనుభవాన్ని

మిగతా 2లో

## తెలంగాణ జాగృతికి కొత్త అధ్యక్షురాలు

- ఫౌండర్ ఛైర్పర్సన్‌గా కల్వకుంట్ల కవిత
- తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలిగా మారిపల్లి మాధవి నియామకం
- ఫౌండర్ ఛైర్పర్సన్‌గా కొనసాగనున్న కల్వకుంట్ల కవిత
- సంస్థ ప్రయాణంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిన జాగృతి
- తెలంగాణ ఆత్మగౌరవం, సాంస్కృతిక పరిరక్షణే ప్రధాన లక్ష్యమని కవిత స్పష్టం
- కొత్త నాయకత్వంలో సంస్థ కార్యకలాపాలు మరింత విస్తరిస్తాయని ఆశాభావం

2 లో

# నడిరోడ్డుపై టీజీపీఎస్సీ ఓఎంఆర్ షీట్లు

- గోప్యత గాలికొదిలిందా.? లేక నిర్లక్ష్యానికి ఇదే నిదర్శనమా.?
- శివరాంపల్లి,అరంఘర్ మార్గంలో కుప్పలుగా పడిన ఒరిజినల్ ఓఎంఆర్ షీట్లు
- 2018 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్షకు సంబంధించినవిగా గుర్తింపు
- అభ్యర్థుల వివరాలు బహిర్గతం కావడంతో కలకలం
- నిబంధనలు ఉల్లంఘించి రీసైక్లింగ్‌కు తరలించారా.?
- మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని జిల్లా ఎస్పీకి టీజీపీఎస్సీ ఆదేశం



**ప్రజా వాయిస్,హైదరాబాద్:** ఒకప్పుడు ప్రశ్నాపత్రాల లీకేజీతో దేశ వ్యాప్తంగా విమర్శలు ఎదుర్కొన్న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఇప్పుడు మరోసారి తీవ్ర వివాదంలో చిక్కుకుంది. గోప్యంగా భద్రపరచాల్సిన అభ్యర్థుల ఒరిజినల్ ఓఎంఆర్ షీట్లు నడిరోడ్డుపై చెల్లాచెదురుగా కనిపించడం తీవ్ర సంచలనంగా మారింది. శివరాంపల్లి నుంచి అరంఘర్ అండర్‌పాస్ వరకు పీవీ ఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేపై కుప్పలుగా పడివున్న ఓఎంఆర్ షీట్లను చూసిన వాహనదారులు వాటి ఫొటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో విషయం క్షణాల్లో వైరల్ అయింది. దీంతో పరీక్షల గోప్యత, అభ్యర్థుల వ్యక్తిగత సమాచారం భద్రతపై మరోసారి తీవ్ర ప్రశ్నలు తలెత్తాయి.ప్రాథమిక సమాచారం ప్రకారం ఇవి 2018లో నిర్వహించిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ (వసతి గృహ సంక్షేమాధికారి) నియామక పరీక్షలకు సంబంధించిన ఒరిజినల్ ఓఎంఆర్ షీట్లు. వాటిపై అభ్యర్థుల పేర్లు, హాల్‌టికెట్ నంబర్లు, పేపర్ కోడ్‌లు, ఇన్విజిలేటర్ల సంతకాలు స్పష్టంగా ఉండటంతో ఈ ఘటన తీవ్ర ఆందోళనకు దారితీసింది. గోప్యంగా ఉండాల్సిన పరీక్షా రికార్డులు సామాన్య ప్రజల చేతికి చేరడం టీజీపీఎస్సీ భద్రతా వ్యవస్థపై పెద్ద ప్రశ్నార్థకంగా మారింది.ఘటన సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని రోడ్డుపై చెల్లాచెదురుగా పడిన ఓఎంఆర్ షీట్లను స్వాధీనం చేసుకున్నారు. అవి ఎలా బయటకు వచ్చాయి? ఎవరు తరలిస్తున్నారు? ఏ పరిస్థితుల్లో రోడ్డుపై పడిపోయాయి? అనే కోణాల్లో విచారణ చేపట్టారు.

### నిబంధనలు పక్కన పెట్టారా..?

సాధారణంగా నియామక పరీక్షల అనంతరం ఓఎంఆర్ షీట్లను నిబంధనల ప్రకారం చిన్న చిన్న ముక్కలుగా ధ్వంసం చేసిన తర్వాతే స్క్రాప్ లేదా రీసైక్లింగ్‌కు పంపించాలి. కానీ ఈ ఘటనలో ఆ ప్రక్రియను పాటించకుండా యథాతథంగా వాహనంలో తరలిస్తుండగా రోడ్డుపై పడిపోయినట్లు ప్రాథమిక సమాచారం వెలుగులోకి రావడం మరింత వివాదాస్పదంగా మారింది. ఇది కేవలం నిర్లక్ష్యమా.? లేక నిబంధనల ఉల్లంఘననా.? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

### అభ్యర్థుల ఆగ్రహం.. గోప్యత ఎక్కడ.?

పరీక్షలు రాసిన అభ్యర్థుల వ్యక్తిగత వివరాలు బహిర్గతమయ్యేలా వ్యవహరించడం తీవ్ర బాధ్యతారాహిత్యమని అభ్యర్థులు మండిపడుతున్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటన తర్వాత పారదర్శకత, భద్రత విషయంలో పాఠాలు నేర్చుకోవాల్సిన టీజీపీఎస్సీ మరోసారి ఇలాంటి వివాదంలో చిక్కుకోవడం ఆందోళన కలిగిస్తోందని అభిప్రాయపడుతున్నారు.

### మూడు రోజుల్లో నివేదిక

ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన టీజీపీఎస్సీ, సంబంధిత జిల్లా ఎస్పీ మూడు రోజుల్లో పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. నివేదిక ఆధారంగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషన్ ప్రకటించింది. అయితే పరీక్షల గోప్యతకు సంబంధించిన ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఇప్పుడు కీలకంగా మారింది.

# నీట్ పరీక్షల సంస్కరణలకు కేంద్రం కీలక కమిటీ

**మొదటి పేజీ తరువాయి**





వినియోగించనున్నారు.

### కామకోటి ఎంపికపై చర్చ

ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ డాక్టర్ కామకోటి ప్రముఖ కంప్యూటర్ శాస్త్రవేత్తగా గుర్తింపు పొందారు. స్వదేశీ ప్రాసెసర్ అభివృద్ధి, కంప్యూటర్ భద్రత, సాంకేతిక రంగాల్లో ఆయనకు విశేష అనుభవం ఉంది. కంప్యూటర్ ఆధారిత పరీక్షల భద్రతను బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించనున్నారు. అయితే గతంలో గోమూత్రంపై ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర విమర్శలకు గురికావడంతో కమిటీలో ఆయన నియామకం రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

### భద్రతా వ్యూహాలకు తపన్ కుమార్ దేకా

1988 బ్యాచ్ అస్సాం-మేఘాలయ కేడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి తపన్ కుమార్ దేకా కూడా కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. ఇంటెలిజెన్స్, ఉగ్రవాద నిరోధక చర్యలు, సైబర్ భద్రత, కుట్రల దర్యాప్తులో ఆయనకు ఉన్న అనుభవంతో ప్రశ్నపత్రాల లీకేజీలు, మోసపూరిత నెట్‌వర్క్‌లను అరికట్టే భద్రతా వ్యవస్థల రూపకల్పనలో కీలక బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

### విద్యా సంస్కరణల్లో అనితా కర్వాల్

మాజీ ఐఏఎస్ అధికారి అనితా కర్వాల్ కేంద్ర విద్యాశాఖ కార్యదర్శిగా, సీబీఎస్ఈ ఛైర్మన్‌గా పనిచేసిన అనుభవం కలిగి ఉన్నారు. పాఠశాల విద్యా సంస్కరణలు, జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో ఆమె అనుభవం కొత్త విధానాల అమలుకు ఉపయోగపడనుంది.

### లాజిస్టిక్స్ బాధ్యతల్లో అమృత్ లాల్ మీనా

సీనియర్ ఐఏఎస్ అధికారి అమృత్ లాల్ మీనా దేశ వ్యాప్తంగా ప్రశ్నపత్రాల సురక్షిత రవాణా, ఏజెన్సీల మధ్య సమన్వయం, లాజిస్టిక్స్ వ్యవస్థను పటిష్టం చేయడంలో కీలక బాధ్యతలు నిర్వహించనున్నారు.

### లీకేజీలకు శాశ్వత చెక్?

ఈ కమిటీ ఇచ్చే సిఫార్సుల ఆధారంగా జాతీయ పరీక్షా వ్యవస్థలో సమగ్ర మార్పులు తీసుకొచ్చి, భవిష్యత్తులో ప్రశ్నపత్రాల లీకేజీలు, పరీక్షల అక్రమాలను పూర్తిగా అరికట్టాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.



# పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించిన కేసీఆర్..

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** బీఆర్ఎస్ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తీవ్ర అస్వస్థతతో సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం ఆస్పత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. పెద్ది ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను నేరుగా అడిగి తెలుసుకున్న కేసీఆర్.. అత్యుత్తమ వైద్యం అందించాలని కోరారు.

### భావోద్వేగానికి గురైన కేసీఆర్

వైద్యులతో దాదాపు అరగంట పాటు చర్చించిన కేసీఆర్.. పెద్ది సుదర్శన్ రెడ్డిని కాపాడేందుకు అన్ని విధాలా ప్రయత్నాలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా వైద్యుల ముందు చేతులెత్తి నమస్కరిస్తూ.. "ఏం చేస్తారో చేయండి.. కానీ మా పెద్ది సుదర్శన్ రెడ్డిని కాపాడండి" అంటూ భావోద్వేగంగా విజ్ఞప్తి చేశారు.

### మరో 48 గంటలు కీలకం

పెద్ది సుదర్శన్ రెడ్డికి ప్రపంచస్థాయి వైద్యం అందిస్తున్నామని యశోద ఆస్పత్రి వైద్యులు కేసీఆర్‌కు వివరించారు. అవసరమైతే విదేశీ నిపుణుల సలహాలు కూడా తీసుకుంటున్నామని తెలిపారు. గుండె, ఊపిరితిత్తులు సహా ఇతర అవయవాలు స్పందిస్తున్నప్పటికీ.. మెదడు పూర్తిస్థాయిలో కోలుకోవడానికి మరో 48 గంటలు అత్యంత కీలకమని వైద్య బృందం వెల్లడించింది.

### పార్టీ అండగా ఉంటుంది

వైద్యుల వివరణ అనంతరం మాట్లాడిన కేసీఆర్.. చికిత్స ఖర్చు విషయంలో ఎలాంటి వెనుకంజ వేయబోమని స్పష్టం చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డిని కాపాడేందుకు బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. వైద్యుల కృషి, దేవుని దయ, ప్రజల ఆశీర్వాదంతో ఆయన త్వరగా కోలుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

### కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన కేసీఆర్

ఆస్పత్రిలో ఉన్న పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన కేసీఆర్.. "దేవుడున్నాడు, డాక్టర్లు ఉన్నారు.. అన్నీ సవ్యంగానే జరుగుతాయి. ధైర్యంగా ఉండండి" అంటూ వారికి మనోధైర్యం నింపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, పద్మారావు గౌడ్, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితర బీఆర్ఎస్ నేతలు కేసీఆర్ వెంట ఉన్నారు. కేసీఆర్ రాకతో ఆస్పత్రి వద్ద భారీగా చేరుకున్న పార్టీ శ్రేణులు, అభిమానుల నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

# తెలంగాణ జాగృతికి కొత్త అధ్యక్షురాలు



**హైదరాబాద్, ప్రజా వాయిస్:** తెలంగాణ సాంస్కృతిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ జాగృతి సంస్థలో కీలక మార్పు చోటు చేసుకుంది. గత రెండు దశాబ్దాలుగా సంస్థను ముందుండి నడిపించిన కల్వకుంట్ల కవిత ఇకపై ఫౌండర్ ఛైర్‌పర్సన్‌గా కొనసాగనుండగా, తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలిగా మారిపల్లి మాధవిని నియమిస్తూ సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని సంస్థ ప్రకటించింది.

### కొత్త నాయకత్వానికి బాధ్యతలు

తెలంగాణ జాగృతి ప్రయాణంలో ఇది ఒక కొత్త అధ్యాయమని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం, సాంస్కృతిక పరిరక్షణ, ప్రజా చైతన్యమే సంస్థ ప్రధాన లక్ష్యాలని, కొత్త నాయకత్వంలో జాగృతి కార్యకలాపాలు మరింత విస్తరిస్తాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

### తెలంగాణ ఉద్యమంలో జాగృతి పాత్ర

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉద్ధృతంగా సాగుతున్న సమయంలో 2006లో తెలంగాణ చరిత్ర, సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేయాలనే లక్ష్యంతో జాగృతిని స్థాపించినట్లు కవిత గుర్తు చేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమానికి సాంస్కృతిక బలాన్ని అందించడంలో జాగృతి కీలక పాత్ర పోషించిందని, తెలంగాణ ప్రత్యేకతలను దేశవ్యాప్తంగా చాటిచెప్పేందుకు నిరంతరం కృషి చేసిందని తెలిపారు.

### బతుకమ్మకు ప్రపంచవ్యాప్త గుర్తింపు

తెలంగాణ పల్లెలకే పరిమితమైన బతుకమ్మ పండుగకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావడంలో జాగృతి చేసిన కృషి చారిత్రాత్మకమని కవిత పేర్కొన్నారు. బతుకమ్మ వేడుకల ద్వారా మహిళలను పెద్ద ఎత్తున సంఘటితం చేసి తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములను చేయడంలో సంస్థ విశేష పాత్ర పోషించిందని చెప్పారు. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో జాగృతి నిరంతరం కృషి చేసిందని వెల్లడించారు.

### మారిపల్లి మాధవికి కీలక బాధ్యతలు

తెలంగాణ జాగృతి ఆవిర్భావం నుంచి సంస్థ చేపట్టిన పలు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో మారిపల్లి మాధవి చురుగ్గా పాల్గొంటున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో బతుకమ్మ ఉత్సవాల నిర్వహణ, మహిళల్లో చైతన్యం తీసుకురావడం, సంస్థ మహిళా విభాగం, జిల్లా స్థాయి సమన్వయ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన ఆమెను తాజాగా రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమించారు.

# జంతర్‌మంతర్ నిరసనలపై కొండా విశ్వేశ్వర్ రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, ప్రజా వాయిస్:** ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జెన్‌జీ విద్యార్థులు, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్వహించిన నిరసనలపై చేవెళ్ల బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ అంశాన్ని అడ్డుపెట్టుకుని కేంద్ర ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు.

### విదేశీ శక్తుల ప్రమేయం ఉందన్న ఆరోపణలు

ఈ ఉద్యమంలో నిజమైన నీట్ విద్యార్థుల కంటే విదేశీ శక్తులు, రోహింగ్యాలు, ఖలిస్తాన్ మద్దతుదారులు, ఇతర విచ్ఛిన్నవాద శక్తులు పాల్గొన్నారని కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆరోపించారు. ఈ నిరసనలకు విదేశీ నిధులు అందుతున్నాయని కూడా ఆయన పేర్కొన్నారు.

### నిరసనలపై బీజేపీ ఎంపీ విమర్శలు

జంతర్‌మంతర్ వద్ద నిరసనలకు కేంద్ర ప్రభుత్వం మూడు వారాల ముందుగానే అనుమతి ఇచ్చిందని తెలిపారు. మొదటి రోజు 50 మంది కూడా హాజరుకాలేదని, అనంతరం ఇతర వర్గాలను సమీకరించి నిరసనను పెద్దదిగా చూపించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. సోషల్ మీడియాలో భారీ మద్దతు ఉందని చెప్పుకునే వారు క్షేత్రస్థాయిలో ప్రజలను సమీకరించలేకపోయారని విమర్శించారు.



### లాఠీఛార్జ్‌పై సమర్థన.. కాల్పుల వ్యాఖ్యలతో వివాదం

పార్లమెంట్ వైపు దూసుకెళ్లే ప్రయత్నం జరిగినప్పుడు పోలీసులు చర్యలు తీసుకోవడం సహజమేనని కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. భారతదేశంలో పోలీసులు లాఠీఛార్జ్ మాత్రమే చేశారని, అమెరికా వంటి ఇతర ప్రజాస్వామ్య దేశాల్లో అయితే ఇలాంటి పరిస్థితుల్లో కాల్పులు కూడా జరిగే అవకాశం ఉంటుందని చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి.

### కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

విద్యార్థులను రెచ్చగొట్టి హింసకు ప్రేరేపించిన వారిపై, అలాగే ఈ నిరసనలకు మద్దతు తెలిపిన రాజకీయ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కొండా విశ్వేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. మరోవైపు ఆయన వ్యాఖ్యలపై ప్రతిపక్ష నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తుండగా, రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది.

# హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు సీరియస్

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** హైడ్రా కమిషనర్ రంగనాథ్ వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాలను పదేపదే అమలు చేయకపోవడాన్ని తీవ్రంగా పరిగణించిన న్యాయస్థానం.. రంగనాథ్‌ను వెంటనే హైడ్రా కమిషనర్ పదవి నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సంచలన ఆదేశాలు జారీ చేసింది. అలాగే ఆయన స్థానంలో ఐజీ స్థాయి అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని స్పష్టం చేసింది.

### కోర్టు ఆదేశాల ఉల్లంఘనపై తీవ్ర ఆగ్రహం

లోతుకుంట భూముల వ్యవహారానికి సంబంధించిన విచారణ సందర్భంగా కోర్టు ఇప్పటికే మూడు సార్లు ఇచ్చిన ఆదేశాలు అమలు కాలేదని హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టు సూచనలను బేఖాతరు చేయడం ఏమాత్రం సమంజసం కాదని వ్యాఖ్యానించింది. రంగనాథ్ కోర్టుకు క్షమాపణలు చెప్పినా వాటిని పరిగణలోకి తీసుకోవడం లేదని స్పష్టం చేసింది.

### ప్రైవేట్ భూముల వ్యవహారాల్లో జోక్యంపై అభ్యంతరం

హైడ్రా తన పరిధిని దాటి ప్రైవేట్ భూముల వ్యవహారాల్లో తీసుకుంటున్న నిర్ణయాలపై కూడా హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. గతంలో కూడా ఇలాంటి అంశాలపై కోర్టు హెచ్చరించినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదని న్యాయస్థానం పేర్కొంది.

### 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఎందుకు..?

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై మొత్తం 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని హైకోర్టు గుర్తు చేసింది. ఇన్ని ధిక్కరణ పిటిషన్లు ఎందుకు వచ్చాయో వివరణ ఇవ్వాలని ప్రశ్నిస్తూ, తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

### రంగనాథ్ అఫిడవిట్‌లో వివరణ

ఈ సందర్భంగా హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో రంగనాథ్.. కోర్టులు, న్యాయ వ్యవస్థపై తనకు పూర్తి గౌరవం ఉందని పేర్కొన్నారు. లోతుకుంట సర్వే నంబర్ 1, 2లోని భూముల్లోకి తాము ప్రవేశించలేదని, పిటిషనర్ కోర్టుకు అవాస్తవాలు తెలిపారని వివరణ ఇచ్చారు. అయినప్పటికీ కోర్టు ఆయన వివరణతో సంతృప్తి చెందకుండా, కోర్టు ఆదేశాల అమలులో నిర్లక్ష్యాన్ని తీవ్రంగా తప్పుబడింది.

# విద్యా వ్యవస్థను కుదేలు చేసింది రేవంత్ ప్రభుత్వమే

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ పూర్తిగా వైఫల్యానికి గురికావడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే బాధ్యత వహించాలని, విద్యాశాఖ మంత్రిగా నైతిక బాధ్యత స్వీకరించి వెంటనే రాజీనామా చేయాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యాశాఖను యువ నాయకుడికి అప్పగిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని కూడా నిలబెట్టుకోలేదని విమర్శించారు.

### వయస్సు తగ్గింపు ప్రతిపాదన ప్రజల దృష్టి మళ్లించేందుకే

ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయస్సును 25 నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రతిపాదన ప్రజల దృష్టిని మళ్లించేందుకు చేస్తున్న డైవర్షన్ పాలిటిక్స్ మాత్రమేనని రాంచందర్ రావు విమర్శించారు. రాజ్యాంగ నిర్మాతలు, ముఖ్యంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ శాసనసభ్యుడికి అనుభవం అవసరమనే దూరదృష్టితోనే 25 ఏళ్ల వయోపరిమితిని నిర్ణయించారని గుర్తు చేశారు. కాంగ్రెస్‌కు నిజంగా యువతకు అవకాశాలు ఇవ్వాలనే చిత్తశుద్ధి ఉంటే ముందుగా జాతీయ అధ్యక్ష పదవి నుంచి మల్లికార్జున్ ఖర్గేను తప్పించి యువ నాయకుడికి బాధ్యతలు అప్పగించాలని సవాల్ విసిరారు.

### ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో విద్యార్థుల ఇబ్బందులు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా విద్యార్థులు, యువతకు ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు కాలేదని ఆయన ఆరోపించారు. సుమారు 20 లక్షల మంది విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.12,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇప్పటికీ విడుదల కాలేదని, దీంతో వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

### యూనివర్సిటీలకు నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం

తెలంగాణలోని 17 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు నిధుల కొరత, అధ్యాపకుల కొరతతో తీవ్ర సంక్షోభంలో ఉన్నాయని రాంచందర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్సిటీలకు రూ.1,000 కోట్లు ఇస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. ఉపాధ్యాయులకు జీతాలు, రిటైర్మెంట్ బెనిఫిట్లు అందక విద్యా వ్యవస్థ కుదేలవుతోందని అన్నారు.

### యువతకు ఇచ్చిన హామీలు ఎక్కడ..?

ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించిన 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి, విద్యాభరోసా కార్డులు, విద్యార్థినులకు ఉచిత స్కూటర్లు, ప్రైవేట్ ఉద్యోగాల్లో 75 శాతం స్థానికులకు రిజర్వేషన్లు, యూత్ కమిషన్, ఎంప్లాయిమెంట్ సపోర్ట్ సిస్టమ్ వంటి హామీలన్నీ గాలిలో కలిసిపోయాయని విమర్శించారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే విద్యాశాఖ బాధ్యతలను యువ ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి అప్పగించి కాంగ్రెస్ ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని రాంచందర్ రావు సూచించారు.

# రూ.73 కోట్ల ధాన్యం మాయం

- పరారీలో రాజకీయ నేత
- 29,188 టన్నుల ప్రభుత్వ ధాన్యం గల్లంతు.. విజిలెన్స్ దర్యాప్తులో భారీ కుంభకోణం బట్టబయలు
- బాలెంలలోని రెండు రైస్ మిల్లులే కేంద్రంగా గోల్‌మాల్
- రికార్డుల్లో ధాన్యం గోదాముల్లో ఖాళీ
- TRP జనరల్ సెక్రటరీ వట్టె జానయ్య యాదవ్ కోసం ప్రత్యేక గాలింపు
- కుమారుడి అరెస్ట్, మిల్లులు సీజ్ లారీలు స్వాధీనం
- అధికారుల అండతోనే అక్రమ రవాణా జరిగిందా?
- వ్యాపారులు, మధ్యవర్తుల పాత్రపైనా విజిలెన్స్ ఫోకస్

జా వాయిస్,సూర్యాపేట:ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం పేదలకు చేరాల్సిన బియ్యంగా మారాల్సిన నిల్వలు చివరకు కోట్ల రూపాయల అక్రమ వ్యాపారానికి మార్గంగా మారాయా.? సూర్యాపేట జిల్లాలో వెలుగుచూసిన ఈ భారీ ధాన్యం కుంభకోణం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు బయటపెట్టిన వివరాలు చూస్తే ప్రభుత్వ పర్యవేక్షణ వ్యవస్థలోని లోపాలు, అక్రమాల పరిమాణం రెండూ స్పష్టంగా కనిపిస్తున్నాయి.బాలెంలలోని వజ్ర రైస్ కార్పొరేషన్, వజ్ర వికాస్ రైస్ మార్ట్ మిల్లులను కేంద్రంగా చేసుకుని ఏకంగా 29,188 టన్నుల ప్రభుత్వ ధాన్యం గల్లంతైనట్లు అధికారులు నిర్ధారించారు. దీని విలువ సుమారు రూ.73 కోట్లు ఉంటుందని అంచనా. ప్రభుత్వానికి అప్పగించాల్సిన సీఎంఆర్ బియ్యం, నిల్వల లెక్కల్లో భారీ వ్యత్యాసాలు బయటపడటంతో విజిలెన్స్ అధికారులు లోతుగా విచారణ చేపట్టారు.

### లెక్కల్లో ఉంది... గోదాముల్లో లేదు!

పత్రాల్లో వేల టన్నుల ధాన్యం కనిపించింది.కానీ మిల్లుల్లో మాత్రం ఆనవాళ్లే కనిపించలేదు. స్టాక్ రిజిస్టర్లు, రవాణా పత్రాలు, నిల్వల వివరాలను సరిపోల్చిన విజిలెన్స్ అధికారులు భారీ అక్రమాన్ని గుర్తించారు. ప్రభుత్వ ధాన్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయించినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.

### పరారీలో ప్రధాన నిందితుడు

ఈ కేసులో TRP పార్టీ జనరల్ సెక్రటరీ వట్టె జానయ్య యాదవ్ను ప్రధాన నిందితుడిగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు కాగానే ఆయన పరారీలోకి వెళ్లడంతో ప్రత్యేక బృందాలు రాష్ట్రవ్యాప్తంగా గాలింపు చేపట్టాయి. మరోవైపు ఆయన కుమారుడిని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

### మిల్లులు సీజ్..లారీలు స్వాధీనం

అక్రమ రవాణాకు ఉపయోగించిన లారీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రెండు రైస్ మిల్లులను సీజ్ చేసి రికార్డులు, కంప్యూటర్ హార్డ్‌డిస్కులు, స్టాక్ రిజిస్టర్లు, బ్యాంకు లావాదేవీల వివరాలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ ధాన్యం ఎక్కడికి వెళ్లింది? ఎవరెవరు కొనుగోలు చేశారు? అనే కోణంలోనూ విచారణ కొనసాగుతోంది.

### అసలు సూత్రధారులు ఎవరూ..?

ఇంత భారీ స్థాయిలో ప్రభుత్వ ధాన్యం మాయమవుతున్నా సంబంధిత శాఖలకు తెలియలేదా? తనిఖీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయా? అధికారుల సహకారం లేకుండా ఇంత పెద్ద కుంభకోణం సాధ్యమేనా? అనే ప్రశ్నలు ఇప్పుడు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో కొందరు అధికారులు, వ్యాపారవేత్తలు, మధ్యవర్తుల పాత్రపై విజిలెన్స్ ప్రత్యేకంగా దృష్టి సారించింది.

### ఇంకా పెద్ద తలలు చిక్కేనా.?

దర్యాప్తు విస్తరిస్తున్న కొద్దీ ఈ కుంభకోణం మరింత పెద్దదిగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్వాధీనం చేసుకున్న రికార్డుల ఆధారంగా మరికొందరి పాత్ర బయటపడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. త్వరలోనే మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా మాయం చేసిన ఈ వ్యవహారం రాష్ట్రంలోనే అతిపెద్ద ధాన్యం కుంభకోణాల్లో ఒకటిగా నిలిచే అవకాశముందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

# ఫిర్యాదు టేబుల్‌పైకి... అధికారులు ఫోన్ లైన్‌లోకి

**ప్రజావాణిలో 12 ఫిర్యాదులు స్వీకరించిన మిర్యాలగూడ ఆర్డీఓ రమణారెడ్డి**



**ప్రజా వాయిస్ | మిర్యాలగూడ** మిర్యాలగూడ రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ ఆర్డీఓ రమణారెడ్డి సోమవారం ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు.ప్రజావాణిలో మొత్తం 12 ఫిర్యాదులు అందగా, ప్రతి వినతిని స్వయంగా పరిశీలించిన ఆయన సంబంధిత శాఖల అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.భూ వివాదాలు, రెవెన్యూ సంబంధిత అంశాలు, ధ్రువపత్రాల జారీ, ఇతర పరిపాలనా సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను విన్న ఆర్డీఓ, పెండింగ్‌లో ఉన్న కేసులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా ప్రతి ఫిర్యాదుపై బాధ్యతతో స్పందించాలని సూచించారు.ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని సకాలంలో పరిష్కరించడం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత అని పేర్కొన్న ఆర్డీఓ రమణారెడ్డి, ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యం సహించబోమని అధికారులను హెచ్చరించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించే దిశగా ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

# వృద్ధ దంపతుల ఆవేదన.. న్యాయం చేయండి

- లేదంటే కారుణ్య మరణానికి అనుమతి ఇవ్వండి
- మూడు ఎకరాల 11 గుంటల భూమి వివాదంతో కుటుంబంలో చిచ్చు
- వీల్‌చైర్‌లో ఉన్న తండ్రిపై దాడి కేసు ఉన్నా మారని తీరు
- ప్రాణహాని ఉందంటూ ఆర్డీవోను ఆశ్రయించిన బాధితులు




**ప్రజా వాయిస్, మిర్యాలగూడ/వేములపల్లి:** ఆస్తి కోసం కన్నతల్లిదండ్రుల పైనే అమానుషంగా వ్యవహరించిన ఘటన నల్గొండ జిల్లా వేములపల్లి మండలంలో వెలుగుచూసింది. కుటుంబ వివాదాలతో తీవ్ర మనోవేదనకు గురైన వృద్ధ దంపతులు చివరకు మిర్యాలగూడ ఆర్డీవోను ఆశ్రయించి తమకు ప్రాణ రక్షణ కల్పించాలని వేడుకున్నారు. ఒకవేళ తమకు న్యాయం చేయలేని పరిస్థితి ఉంటే కారుణ్య మరణానికి అనుమతి ఇవ్వాలని వినతిపత్రం సమర్పించడం స్థానికంగా చర్చనీయాంశమైంది.వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన గగ్గనపల్లి బుచ్చిరెడ్డి, అనసూయ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. తమ ఆస్తిని ఇద్దరు కుమారులకు సమానంగా పంచినట్లు వారు తెలిపారు. అయితే వృద్ధాప్యంలో వైద్య ఖర్చుల కోసం ఉంచుకున్న మూడు ఎకరాల 11 గుంటల భూమిని తమను చూసుకుంటున్న మనవడికి రిజిస్ట్రేషన్ చేయగా, ఆ భూమిలోనూ వాటా ఇవ్వాలని పెద్ద కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు.ఈ క్రమంలో వీల్‌చైర్‌లో ఉన్న బుచ్చిరెడ్డిపై పెద్ద కోడలు చెప్పుతో దాడి చేసిన ఘటనపై గతంలో పోలీసు కేసు నమోదైనా, వారి ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని బాధితులు తెలిపారు. కేసును ఉపసంహరించుకోవాలని, లేకపోతే ట్రాక్టర్‌తో తొక్కిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.కుటుంబ సభ్యుల వేధింపులతో తీవ్ర ఆందోళనకు గురైన వృద్ధ దంపతులు మిర్యాలగూడ ఆర్డీవో కార్యాలయాన్ని ఆశ్రయించి వినతిపత్రం అందజేశారు.తమకు తక్షణమే ప్రాణ రక్షణ కల్పించాలని, తమను వేధిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు. న్యాయం జరగని పక్షంలో తమకు కారుణ్య మరణానికి అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేయడం ఈ ఘటన తీవ్రతను ప్రతిబింబిస్తోంది.



# కొండాపూర్ మండలం మన్సాన్‌పల్లి బంధం వాగుపై అనుమతుల్లేని అక్రమ వంతెన

- ఇరిగేషన్ ,రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం రైతుల పంట పొలాలకు ముప్పు అంటూ ఆందోళన

**ప్రజా వాయిస్,సంగారెడ్డి :**కొండాపూర్ మండలం మన్సాన్‌పల్లి గ్రామ పరిధిలోని బంధం వాగుపై నిర్మిస్తున్న వంతెనపై స్థానిక రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖల అనుమతులు లేకుండానే వంతెన నిర్మాణం చేపట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని, దీనిపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రైతుల ఆరోపణల ప్రకారం, వంతెన నిర్మాణం కారణంగా వాగు సహజ ప్రవాహానికి ఆటంకం ఏర్పడే అవకాశం ఉందని, వర్షాకాలంలో వరద నీరు వెనక్కి మళ్లి పంట పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని చెబుతున్నారు. లక్షల రూపాయల విలువైన పంటలు దెబ్బతినే అవకాశం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించకపోవడం పట్ల వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.అలాగే, నిర్మాణంలో నాసిరకం సామగ్రి వినియోగిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, నాణ్యతా పరీక్షలు నిర్వహించకుండా పనులు కొనసాగించడం వల్ల భవిష్యత్తులో వంతెన భద్రత కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని స్థానికులు అంటున్నారు. ఈ విషయంపై వెంటనే ఉన్నతాధికారులు స్పందించి వంతెన నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, సాంకేతిక ప్రమాణాలు, నాణ్యత అంశాలపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలు జరిగి ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# స్పందించని అధికారులు.. కుమిలిపోతున్న కృష్ణానగర్!

- 11వ డివిజన్‌లో తీవ్రరూపం దాల్చిన డ్రైనేజీ సమస్య
- కాలువ నిండా మట్టి, పూడిక
- కూలిపోయే స్థితిలో నిర్మాణం
- అధికారులు, ప్రజాప్రతినిధులపై కాలనీవాసుల ఆగ్రహం



**ప్రజా వాయిస్ గోదావరిఖని** రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని 11వ డివిజన్ కృష్ణానగర్‌లో డ్రైనేజీ సమస్య వర్ణనాతీతంగా మారింది. సరైన నిర్వహణ లేకపోవడంతో డ్రైనేజీ కాలువలో భారీగా మట్టి, బురద పేరుకుపోయి మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. దీంతో కంపు కొడుతున్న నీటి మధ్య స్థానిక ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. లక్షల రూపాయల వ్యయంతో కార్పొరేషన్ అధికారులు ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ డ్రైనేజీ కాలువ, అధికారుల ఉదాసీనత వల్ల ప్రస్తుతం పాడైపోయి ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదకర స్థితికి చేరుకుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పట్టించుకోని కార్పొరేటర్, అధికారులు ఈ సమస్యపై ఎన్నిసార్లు అధికారులకు, స్థానిక కార్పొరేటర్‌కు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని కాలనీవాసులు మండిపడుతున్నారు. ప్రజాప్రతినిధులు కనీస అవగాహన లేకుండా కాలయాపన చేస్తూ, తమ సమస్యలను పెడచెవిన పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి నిర్లక్ష్య వైఖరి వల్ల ప్రతిరోజూ దుర్గంధం, దోమల ముప్పుతో భయపడుతూ బతకాల్సి వస్తోందని ఆవేదన చెందారు. ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలిఇప్పటికైనా నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, డ్రైనేజీ కాలువలో పేరుకుపోయిన మట్టిని, బురదను తొలగించి పూడిక తీత పనులు చేపట్టాలని కృష్ణానగర్ వాసులు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదకరంగా మారిన కాలువకు మరమ్మతులు చేపట్టి, తమను ఈ మురుగు తిప్పల నుండి కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



# కొత్త సారథుల ప్రమాణ స్వీకారం

- మిర్యాలగూడ కాంగ్రెస్‌కు నూతన మండల, పట్టణ అధ్యక్షుల బాధ్యతల స్వీకారం
- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సమక్షంలో ఘనంగా కార్యక్రమం
- పార్టీ బలోపేతం, ప్రజలకు చేరువయ్యేలా పనిచేయాలని పిలుపు

**ప్రజా వాయిస్, మిర్యాలగూడ:** నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నూతన మండల, పట్టణ అధ్యక్షుల ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు పున్నా కైలాష్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు నియమితులైన అధ్యక్షులు మిర్యాలగూడ పట్టణంలోని రాజీవ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా మిర్యాలగూడ వన్ టౌన్ అధ్యక్షుడిగా కోడిరెక్క ఇంద్రకుమార్, టూ టౌన్ అధ్యక్షుడిగా మొయిజ్, మిర్యాలగూడ మండల అధ్యక్షుడిగా గుండు నరేందర్ గౌడ్, దామరచర్ల మండల అధ్యక్షుడిగా నాగు నాయక్, వేములపల్లి మండల అధ్యక్షుడిగా రేగట్టే రవీందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమానికి మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన అధ్యక్షులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ, పార్టీ బలోపేతంలో కొత్త సారథులు కీలక పాత్ర పోషించాలని, గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తూ కార్యకర్తలను సమన్వయం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ముందుండాలని పిలుపునిచ్చారు.నూతన అధ్యక్షులు పార్టీ అధిష్ఠానం తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ కార్యకర్తలందరినీ కలుపుకొని కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి, ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, మండల, పట్టణ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# పరిపాలనలో ఆదర్శం అభివృద్ధే లక్ష్యం

- మల్లారెడ్డిగూడ గ్రామం సర్పంచ్ సబితా గోవర్ధన్ రెడ్డి
- ఉత్తమ సర్పంచ్ అవార్డు అందుకున్న సబితా గోవర్ధన్ రెడ్డి
- గ్రామాభివృద్ధికి గుర్తింపుగా బహుజన సాహిత్య అకాడమీ సత్కారం

( **ప్రజా వాయిస్ షాబాద్**) గ్రామాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి మల్లారెడ్డిగూడ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్న షాబాద్ మండలం మల్లారెడ్డిగూడ గ్రామ సర్పంచ్ అమీర్పేట సబితా గోవర్ధన్ రెడ్డికి బహుజన సాహిత్య అకాడమీ ఉత్తమ సర్పంచ్ అవార్డు లభించింది.రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అట్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా సబితా గోవర్ధన్ రెడ్డి ఈ అవార్డును నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం అందుకున్నారు.గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో చూపిన విశిష్ట సేవలను గుర్తిస్తూ బహుజన సాహిత్య అకాడమీ ఈ అవార్డును ప్రదానం చేసింది.ఈ కార్యక్రమంలో ఆర్టీఐ కమిషనర్ భూపాల్, మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్, బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్ పాల్గొని సబితా గోవర్ధన్ రెడ్డిని అభినందించారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తమ్మలి రమేష్,మల్లారెడ్డిగూడ గ్రామ ఉపసర్పంచ్ మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.





# రైతులకు అండగా నిలిచేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- ధర్మసాగర్ రిజర్వాయర్ ద్వారా నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు ,కడియం శ్రీహరి

**ప్రజా వాయిస్ హన్మకొండ** / ధర్మసాగర్ రైతులకు అండగా నిలిచేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు అన్నారు.సోమవారం ధర్మసాగర్ రిజర్వాయర్ సౌత్ కెనాల్ నుండి నీటిని స్థానిక స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తో కలిసి విడుదల చేశారు. ఎల్ నీవో ప్రభావం వల్ల వర్షాలు లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు అండగా నిలిచేందుకు రిజర్వాయర్ ద్వారా పరవళ్లు తొక్కుతూ వస్తున్న గోదావరి జలాలకు పసుపు, కుంకుమలు, పుష్పాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో ఘన స్వాగతం పలికారు. వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోని హసన్పర్తి,ఐనవోలు,వర్ధన్నపేట మండలాల పరిధిలోని రైతుల పంట పొలాలకు నీళ్లు అందించడం కోసం సౌత్ కెనాల్ గేట్లను ఎత్తి కాల్వల ద్వారా జలాలను విడుదల చేశామన్నారు. రైతులకు అన్ని విధాలుగా అండగా నిలిచిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని కొనియాడారు. నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకొని రైతులకు నీళ్లు వస్తాయని వర్షాలు సమృద్ధిగా పడితే నిరంతరం నీళ్లు వస్తూనే ఉంటాయని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ నీటి నిలువలతో కాలువ ఆయకట్టు పరిధిలోని రైతులకు సాగునీటి సమస్య కొంత మేరకు సమస్య పరిష్కారం కానుందని పేర్కొన్నారు.ఇప్పుడు కాలువ ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందుతోందన్నారు. ప్రజలకు,రైతులకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ఈ కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మెన్ మార్నేని రవీందర్ రావు,మాజీ జడ్పీటీసీ బానోత్ సింగులాల్,45 డివిజన్ అధ్యక్షులు హరీష్ రెడ్డి,44వ డివిజన్ అధ్యక్షులు సదానందం,46వ డివిజన్ అధ్యక్షులు శ్రీకాంత్,ఐనవోలు సర్పంచుల ఫోరం అధ్యక్షులు శంకర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బుచ్చిరెడ్డి,ఏనుమాముల మార్కెట్ డైరెక్టర్ రైతు రాజు,సీనియర్ నాయకులు విసం సురేందర్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,రాకేష్ రెడ్డి,దువ్వ నవీన్,సదానందం,నియోజకవర్గాల,డివిజన్,మండల,గ్రామ ముఖ్య నాయకులు, సర్పంచులు,కార్యకర్తలు,రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లర్లతో మున్సిపల్ చైర్మన్ సమావేశం

- పొట్టు,దుమ్ము, పొగతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు

**ప్రజా వాయిస్, హుజూర్ నగర్**, జూలై 27సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పురపాలక సంఘం పరిధిలోని రైస్ మిల్లుల నుండి వెలువడుతున్న పొట్టు, దుమ్ము, ధూళి, పొగతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ రైస్ మిల్లర్లకు సూచించారు సోమవారం పురపాలక సంఘ కార్యాలయంలో చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన హుజూర్ నగర్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మరియు రైస్ మిల్లుల యజమానులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. రైస్ మిల్లుల నుండి వస్తున్న వ్యర్థాలతో స్థానికులకు ఆరోగ్య సమస్యలు, పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయని, ఇకపై ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగిన నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించని మిల్లులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ సమావేశంలో రాష్ట్ర పెరిక సంఘ కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ తన్నీరు మల్లిఖార్జున్, కమిషనర్ కత్తి సతీష్ కుమార్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పోలిశెట్టి నరసింహ రావు, గజ్జి ప్రభాకర్, ఓరుగంటి నాగేశ్వర రావు, కిరణ్, కోటయ్య, రైస్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.





# యూజీడీ పేరుతో కోట్ల కుంభకోణమా..?

- కోదాడలో పనులు వెంటనే నిలిపేయాలి
- రూ.182 కోట్ల టెండర్‌ను రూ.258 కోట్లుగా ప్రచారం చేస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆరోపణ
- బ్లాక్‌లిస్టులో ఉన్న కాంట్రాక్టర్‌కే పనుల అప్పగింతపై తీవ్ర అభ్యంతరం
- జిల్లా కలెక్టర్‌తో సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**ప్రజా వాయిస్,కోదాడ:**కోదాడ పట్టణంలో చేపడుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పనులు అభివృద్ధి పేరుతో అవినీతికి కేంద్రంగా మారాయని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆరోపించారు. కోదాడలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నాసిరకం నిర్మాణంతో జరుగుతున్న పనులు భవిష్యత్తులో ప్రజలకు లాభం కంటే నష్టమే ఎక్కువగా కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు.యూజీడీ ప్రాజెక్టు అసలు టెండర్ విలువ రూ.182 కోట్లు మాత్రమే కాగా, ప్రజలకు మాత్రం రూ.258 కోట్ల ప్రాజెక్టుగా ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యత్యాసంపై ప్రభుత్వం, అధికారులు ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పనులు చేపడుతున్న సంస్థ బ్లాక్‌లిస్టులో ఉన్న కాంట్రాక్టర్‌కు చెందినదేనని, అలాంటి సంస్థకు పనులు అప్పగించడం అనుమానాలకు తావిస్తోందన్నారు.పట్టణ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని నిపుణుల పర్యవేక్షణలో నాణ్యతా ప్రమాణాలతో పనులను చేపట్టాలని సూచించారు. అలాగే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని యూజీడీ పనులపై సమగ్ర విచారణ జరిపి, అవసరమైతే పనులను నిలిపివేసి పారదర్శకంగా ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా పట్టణంలో పారిశుద్ధ్యం, నిర్వహణ వ్యవస్థలు కూడా నిర్లక్ష్యానికి గురయ్యాయని బొల్లం మల్లయ్య యాదవ్ విమర్శించారు.

# మంత్రిగారి ఇలాకలో - అధికారుల నిర్లక్ష్యం

- కుంటుపడుతున్న మంథని విద్యావ్యవస్థ
- పాఠశాలలు, కాలేజీలు ప్రారంభమైనా తెరుచుకోని హాస్టళ్లు!
- అడ్మిషన్లు జరుగుతుంటే తాళాలు వేయడం ఏంటి?
- వెంటనే సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్ డిమాండ్



**ప్రజా వాయిస్ మంథని** మంథని మండల కేంద్రంలో ప్రభుత్వ హాస్టళ్ల నిర్వహణ పట్ల అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వారి బాధ్యతారాహిత్యం వల్లే మంథనిలో విద్యావ్యవస్థ తీవ్రంగా కుంటుపడుతోందని స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.ఎస్ఎఫ్ఐ మంథని మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక హాస్టళ్లను సందర్శించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. హాస్టళ్లలోని సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుందామని వెళ్లిన ఎస్ఎఫ్ఐ బృందానికి, మూసి ఉన్న హాస్టల్ తలుపులు, వేసిన తాళాలే దర్శనమిచ్చాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు పాఠశాలలు, కాలేజీలు నడుస్తూ అడ్మిషన్ల ప్రక్రియ వేగంగా జరుగుతుంటే, విద్యార్థులకు ఆసరాగా నిలవాల్సిన హాస్టళ్లకు తాళాలు వేసి ఉంచడం ఏంటని అధికారులను ప్రశ్నించారు. విద్యార్థులు అడ్మిషన్లు ఎలా తీసుకోవాలి, ఎక్కడ ఉండాలని ఆయన నిలదీశారు. కేవలం బాలుర హాస్టళ్లే కాకుండా, మంథనిలోని ఎస్సీ బాలికల హాస్టల్ పరిస్థితి కూడా ఇలాగే ఉందని, అది కూడా తాళాలకే పరిమితమైందని మండిపడ్డారు. ప్రభుత్వం నుంచి నెలకు వేలాది రూపాయల వేతనాలు తీసుకుంటున్న వార్డెన్లు, పర్యవేక్షించాల్సిన జిల్లా అధికారులు విధులను గాలికి వదిలేశారని విమర్శించారు. అధికారుల ఈ అలసత్వమే హాస్టళ్లు మూతపడడానికి ప్రధాన కారణమని స్పష్టం చేశారు. ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారి సొంత నియోజకవర్గ కేంద్రంలోనే ప్రభుత్వ హాస్టళ్లు, కాలేజీల పరిస్థితి ఇలా అధ్వానంగా తయారవ్వడం అత్యంత విచారకరమని సందీప్ పేర్కొన్నారు. మాన్యుఫ్యాక్చరింగ్ పర్యవేక్షణ లేకపోవడం వల్లే కిందిస్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు

**ఎస్ఎఫ్ఐ డిమాండ్లు:**

ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెంటనే జోక్యం చేసుకుని మంథని నియోజకవర్గంలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ కాలేజీలు మరియు పాఠశాలల సమస్యలపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించాలి. విధుల్లో నిర్లక్ష్యం వహించి, హాస్టళ్లను మూసివేసిన బాధ్యులైన వార్డెన్లు, అధికారులపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. హాస్టళ్లను వెంటనే పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చి, పేద విద్యార్థులకు అడ్మిషన్లు, వసతి సౌకర్యాలు కల్పించాలి. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బందెల రాజ్ కుమార్, నాయకులు అఖిల్, మహేందర్, కిరణ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ ప్రారంభం

- డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్** కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులకు ఐదు రోజుల విషయాల వారీ శిక్షణ కార్యక్రమం జూలై 28 నుంచి ప్రారంభం కానుంది. దీనికి సంబంధించి సోమవారం సన్నాహక సమావేశం జరిగింది.గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ఈ శిక్షణ చేపడుతున్నారు. మొదటి విడత శిక్షణ జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలికలు)లో మంగళవారం నుంచి మొదలవుతుంది. ఈ విడతలో తెలుగు, హిందీ, ఇంగ్లీష్, బయోసైన్స్ సబ్జెక్టుల ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు.బోధనా విధానాలు, విద్యార్థి కేంద్రిత అభ్యాస పద్ధతులు, పాఠ్యాంశాల సమర్థవంతమైన బోధన, అభ్యాస ఫలితాల సాధన వంటి అంశాలపై నిపుణులు శిక్షణ ఇస్తారు. ఉపాధ్యాయులు నిర్ణీత సమయానికి హాజరై శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ సూచించారు.సన్నాహక సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, పీఎంఆర్సీఏసీఎంవో పూర్కా ఉద్దవ్, జిల్లా క్రీడాధికారి మాడావి శేఖు, ప్రధానోపాధ్యాయులు, శిక్షణ సమన్వయకర్తలు పాల్గొని ఏర్పాట్లపై చర్చించారు.





# రాజకీయాల్లో వీళ్ళే కదా అసలైన రోల్ మోడల్స్!

- మాట నిలబెట్టుకున్న కౌన్సిలర్ పోత రవేని శ్రీలత క్రాంతి కుమార్
- రెండు నెలల వేతనంతో నిరుపేదలకు నిత్యావసరాల పంపిణీ

**ప్రజా వాయిస్ మంథని** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చే హామీలను గెలిచిన తర్వాత మరచిపోయే నాయకులున్న సోమవారం, మంథని పట్టణంలోని 6వ వార్డు కౌన్సిలర్ పోతరవేని శ్రీలత క్రాంతి కుమార్ ప్రజాప్రతినిధుల బాధ్యతకు సరికొత్త నిర్వచనం చెప్పారు. ప్రజలు తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, తనకు వచ్చిన రెండు నెలల కౌన్సిలర్ వేతనాన్ని వార్డులోని బోయిన్‌పేట అభివృద్ధి, పేదల సంక్షేమానికి వినియోగించి తన ఉదారతను చాటుకున్నారు. ఈ సేవా కార్యక్రమంలో భాగంగా బోయిన్‌పేటకు చెందిన నాలుగు నిరుపేద కుటుంబాలకు బియ్యం, కిరాణా సరుకులు మరియు నిత్యావసర వస్తువులను ఆమె స్వయంగా అందజేశారు.

**సొంత డబ్బులతో సేవా కార్యక్రమాలు:**

రాజకీయ పార్టీల మద్దతు లేకుండా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి, ప్రజల ఆశీర్వాదంతో జిల్లాలోనే అత్యంత భారీ మెజారిటీతో విజయం సాధించిన శ్రీలత క్రాంతి కుమార్, గెలిచిన నాటి నుండి ప్రజలకు అండగా ఉంటున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం తనకు వచ్చే ప్రతి నెల కౌన్సిలర్ వేతనాన్ని ప్రజల సంక్షేమానికే వినియోగిస్తానని ప్రకటించిన ఆమె, అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గతంలో కూడా సొంత నిధులతో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు మరియు అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి అండగా నిలిచారు.

**ప్రజల సంక్షేమమే నా లక్ష్యం:**

ఈ సందర్భంగా కౌన్సిలర్ పోతరవేని శ్రీలత క్రాంతి కుమార్ మాట్లాడుతూ—"ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉండటమే ప్రజాప్రతినిధిగా నా మొదటి బాధ్యత. ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని ఎప్పటికీ వమ్ము చేయను. నీతి, నిజాయితీ, నిస్వార్థంతో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తాను. వార్డు ప్రజల సహకారం, విశ్వాసంతో బోయిన్‌పేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, జిల్లాలోనే ఒక ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దడమే నా ప్రధాన లక్ష్యం." ప్రజా సంక్షేమం కోసం కౌన్సిలర్ శ్రీలత క్రాంతి కుమార్ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల బోయిన్‌పేట ప్రజలు మరియు వార్డు వాసులు హర్షం వ్యక్తం చేస్తూ, ఆమెకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# వరంగల్ విద్యా అభివృద్ధిపై పార్లమెంట్‌లో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు డిజిటల్, భౌతిక మౌలిక వసతుల కల్పనపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో ప్రస్తావించారు. సమగ్ర శిక్ష పథకం అమలు, డిజిటల్ విద్య విస్తరణ, పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధి, కేంద్ర నిధుల కేటాయింపులపై సమగ్ర వివరాలు కోరారు.గత కొంతకాలంగా వరంగల్‌లో ప్రభుత్వ విద్య బలోపేతం, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల పెంపు అంశాలను నిరంతరం పార్లమెంట్‌లో ప్రస్తావిస్తున్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య తాజాగా డిజిటల్ విద్యా మౌలిక వసతులపై కేంద్రాన్ని ప్రశ్నించారు. తెలంగాణతో పాటు వరంగల్ జిల్లాకు గత ఐదేళ్లలో కేంద్రం నుంచి అందిన సహాయం, చేపట్టిన పనులు, విద్యార్థులకు కలిగిన ప్రయోజనాల వివరాలను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు.వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. సమగ్ర శిక్ష పథకం కింద దేశవ్యాప్తంగా పీఎం ఈ–విద్య, దీక్ష, ఐసీటీ ల్యాబ్‌లు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌ల ద్వారా సాంకేతిక ఆధారిత బోధనను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాల వార్షిక కార్యాచరణ ప్రణాళికల మేరకు కేంద్రం ఆర్థిక సహాయం అందిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణకు గత ఐదేళ్లుగా డిజిటల్ విద్యా వసతుల అభివృద్ధికి గణనీయమైన మద్దతు లభించిందని కేంద్రం వెల్లడించింది. 2025–26 విద్యా సంవత్సరంలో రాష్ట్రానికి 1,242 ఐసీటీ ల్యాబ్‌లు, 2,036 స్మార్ట్ క్లాస్‌రూమ్‌లకు ఆమోదం లభించగా, ఇందుకు రూ.108.98 కోట్ల మేర నిధులు మంజూరు చేసినట్లు పేర్కొంది.ఈ మేరకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, వరంగల్‌లో ప్రభుత్వ విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. పార్లమెంట్ వేదికగా వరంగల్ అవసరాలను నిరంతరం కేంద్రం దృష్టికి తీసుకెళ్తున్నానని, విద్య, మౌలిక వసతులు, డిజిటల్ సదుపాయాల విషయంలో మరిన్ని నిధులు, ప్రాజెక్టులు సాధించేందుకు తన కృషి కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రావాలంటే డిజిటల్ వసతులు, ల్యాబ్‌లు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు అత్యంత కీలకమని పేర్కొన్నారు. అందుకు కేంద్రం మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరారు. వరంగల్‌ను విద్యారంగంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు తాము కట్టుబడి ఉన్నామని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య స్పష్టం చేశారు.

# రైతుల కోసం రోడ్డు వేయించిన సింగతి పటేల్ ప్రభాకర్

- హర్షం వ్యక్తం చేస్తూ వెంటనే రాకపోకలు కొనసాగిస్తున్న ప్రజలు.

**ప్రజావాయిస్.పేర్కపల్లి/** బెల్లంపల్లి రూరల్.మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం లోని పేర్కపల్లి గ్రామానికి చెందిన రైతు పటేల్ ప్రభాకర్ తన స్వంత డబ్బులతో గ్రామం నుండి పంట పొలాలకు వెళ్లే దారిలో రోడ్డు లేకపోవడంతో రైతులు నానా అవస్తలు పడుతున్న రైతులు అందరు కలిసి ప్రభాకర్ తో కలిసి వారి యొక్క బాధలు చెప్పడం వలన వెంటనే స్పందించి రైతుల సౌకర్యార్ధం రోడ్డు మరమ్మతులు చేపట్టి నిర్మాణం చేపట్టారు. ఆ యొక్క రోడ్డు వెంట నిరంతరము ప్రజలు వ్యవసాయ పనుల నిమిత్తము రాకపోకలు కొనసాగిస్తారు.ఇప్పుడు ఉన్న రోడ్డు సమస్య తీరడం వలన ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఇక్కడ ఉన్నటువంటి రోడ్డు సమస్య వలన ప్రజలు ఎన్నోసార్లు ఉన్నతాధికారులకు విన్నవించిన ఫలితం లేకపోవడం వలన తానే స్వయంగా రోడ్డు నిర్మాణం చేపట్టారు.అలాగే గ్రామములోని ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కు ఆటస్థలం సరిగా లేకపోవడం వలన వెంటనే స్పందించి మట్టితో చదునుచేయించారు.ఈ యొక్క కార్యక్రమంలో రైతులు పెట్టం శ్రీనివాస్. పెద్దోళ్ల భీమయ్య.రమేష్.అర్జయ్య. అచ్చే స్వామి. బొలిశెట్టి సుధాకర్.చిలుముల వెంకటస్వామి. బాకం కొమురయ్య తదితరులు పాల్గొన్నారు..



# ప్రజా ధనానికి లెక్క చూపియ్యడానికి ఎందుకు ఇంత భయం

- ఎంఆర్పీఎస్ నేత ఆనేగాళ్ల ఆనంద్ మాదిగ
- ఆర్‌టీఐ కింద సమాచారం అడిగితే ఇవ్వని వైనం
- అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం

**(ప్రజా వాయిస్ షాద్ నగర్)**కొందుర్గ్ మండల ప్రాజెక్ట్ పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీఓ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం అమలు తీరుపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా ధనానికి సంబంధించిన లెక్కలు అడిగితే రికార్డులు ఇవ్వడానికి అధికారులు ఎందుకు భయపడుతున్నారు అని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కొందుర్గ్ మండల అధ్యక్షుడు ఆనేగాళ్ల ఆనంద్ మాదిగ ప్రశ్నించారు సమాచార హక్కు చట్టం ప్రకారం కొందుర్గ్ ఎంపీడీఓ కార్యాలయంలో ప్రభుత్వ నిధుల వినియోగానికి సంబంధించిన అధికారిక రికార్డులు, ఐఎఫ్ఎంఐఎస్ ఖాతా వివరాలు, బిల్లులు, వోచర్లు, 15వ ఆర్థిక సంఘం నిధుల వివరాలు జీరో ఖాతాల లావాదేవీలు మరియు సెపెక్ సర్వే చెల్లింపుల వివరాలు కోరుతూ ఆయన దరఖాస్తు చేశారు సాధారణ తెల్ల కాగితాలు ఇవ్వడంపై నిలదీత తాను చట్టబద్ధంగా కోరిన అధికారిక ధృవీకరించిన పత్రాల స్థానంలో ఎక్సెల్‌లో టైప్ చేసిన వివరాలను ఒక సాధారణ తెల్ల కాగితంపై ముద్రించి అందించడం వెనుక అంతర్యమేమిటని ఆనంద్ మాదిగ నిలదీశారు. ఈ విషయంపై స్పష్టత కోసం ఎంపీడీఓను సంప్రదిస్తే సూపరింటెండెంట్‌ను అడగాలని సూపరింటెండెంట్‌ను అడిగితే ఏమాత్రం పొంతన లేని సమాధానాలు ఇస్తూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు అధికారుల ఈ ఉదాసీన వైఖరి వల్ల మండల ప్రజల్లో అనేక అనుమానాలు తలెత్తుతున్నాయన్నారు ప్రజా ధనంపై నిలదీస్తున్న ముఖ్య ప్రశ్నలుఎన్నికల డిపాజిట్లు గ్రామ పంచాయతీలకు రావాల్సిన ఎన్నికల డిపాజిట్ నిధులు ప్రస్తుతం ఎక్కడ ఉన్నాయి సెపెక్ సర్వే నిధులు సెపెక్ సర్వే కోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధులను ఎవరికి ఏ ప్రాతిపదికన ఎంత మేరకు చెల్లించారు సిబ్బంది వేతనాలు డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఎన్యూమరేటర్లకు పూర్తి స్థాయిలో చెల్లింపులు జరిగాయా లేక కోత విధించారా ప్రభుత్వం విడుదల చేసిన నిధులు ఏ బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యాయి ఎంత ఖర్చు చేశారు మిగిలిన నిధుల పరిస్థితి ఏమిటి ప్రజా ధనానికి సంబంధించిన ప్రతి రూపాయికి లెక్క తెలుసుకునే హక్కు సామాన్య పౌరుడికి ఉందని స్పష్టం చేశారు ఎంపీడీఓ కార్యాలయ అధికారులు వెంటనే ఆర్‌టీఐ చట్టం ప్రకారం కోరిన అన్ని అధికారిక రికార్డులు బిల్లులు అందించాలని అవసరమైతే ఈ ఆర్థిక వ్యవహారాలపై ఉన్నతాధికారులతో స్వతంత్ర విచారణ జరిపించి వాస్తవాలను బయటపెట్టాలని ఆనంద్ మాదిగ డిమాండ్ చేశారు.





# రోడ్డు వెడల్పులో ఇల్లు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం కల్పించాలి

- రోడ్డు వెడల్పుపై మరోసారి పునరాలోచన చేయాలి

**ప్రజా వాయిస్ హుస్నాబాద్** హుస్నాబాద్ పట్టణంలోని మల్లె చెట్టు చౌరస్తా నుండి రామవరం రోడ్డు వెడల్పు కార్యక్రమం ప్రభుత్వం చేపట్టినందున తమ ఇల్లు కోల్పోతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు కనీసం తమకు నష్టపరిహారం చెల్లించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వం తీసుకున్న చర్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలని రోడ్డు వెడల్పు ను మరొకసారి పునర్ ఆలోచన చేసి ప్రజల యొక్క జీవన ఆధారమైన ఇండ్లను కోల్పోకుండా చర్యలు చేపట్టాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు ఈరోజు పురపాలక సంఘం కార్యాలయంలో పురపాలక సంఘం చైర్ పర్సన్ అధ్యక్షతన కాలనీవాసులతో సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ప్రజలు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఇండ్లను చూసుకునే బ్రతుకుతున్నామని ఇప్పుడు అభివృద్ధి పేరుతో ఆ ఇళ్లను తీసివేస్తే మా బ్రతుకుతెరువు ఇబ్బంది కలుగుతుందని మాకు ఉన్న ఒక్క జీవనాధారం పోతుందని మేము ఎక్కడ నివసించాలో తెలియని పరిస్థితి నెలకొందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు ఇట్టి విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ జోక్యం చేసుకొని పాలకవర్గం పునరాలోచన చేసి రోడ్డు వెడల్పును తగ్గించి ఇండ్లను పోకుండా చర్యలు తీసుకోవాలని నష్టపోయిన వారికి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా పురపాలక సంఘం చైర్పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వానికి మంత్రి దృష్టికి ఈ విషయం తీసుకెళ్తామని బాధితులకు న్యాయం చేస్తామని ప్రజలు నష్టపోకుండా చర్యలు చేపడతామని తెలిపారు ఈ సందర్భంగా కాలనీవాసులు ఆవేదనకరమైన కన్నీళ్ళతో మాట్లాడుతూ అభివృద్ధికి మేము ఆటంకం కామని కానీ అభివృద్ధి పేరుతో మా ఇండ్లను తీసివేస్తే మేము ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొందని మాకు ఒక దారి చూపించి రోడ్ వెడల్పు కార్యక్రమాన్ని చేపట్టాలని తెలిపారు వెంటనే మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి ఈ విషయంపై మాట్లాడాలని పూర్వికులు వస్తున్న ఇండ్లను కూల్చివేయద్దని ఆవేదన వ్యక్తం చేశారు

# చినుకు పడితే చిత్తడే..!



- తాండూర్-కోటిపల్లి రహదారిపై నిత్యం నరకయాతన
- ఘాజీపూర్ వంతెనకు ఇరువైపులా బీటీ రోడ్డు లేక బురదమయం
- అడుగడుగునా గుంతలతో వాహనదారులు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు
- తక్షణమే రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి

**ప్రజా వాయిస్/ తాండూర్:** తాండూర్ నుంచి కోట్ పల్లి వెళ్లే ప్రధాన రహదారి అధ్వాన్నంగా తయారైంది. కొద్దిపాటి వర్షానికి రహదారి పూర్తిగా బురదమయంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా ఘాజీపూర్ వంతెనకు ఇరువైపులా బీటీ రోడ్డు లేకపోవడంతో చిన్న చినుకు పడినా ఆ ప్రాంతం పూర్తిగా బురదమయంగా మారుతోంది. దీంతో రహదారిపై ప్రయాణం నిత్యం నరకయాతనగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వంతెనకు ఇరువైపులా రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలు ఏర్పడటంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు, ఇతర వాహనాలు నెమ్మదిగా ప్రయాణించాల్సి వస్తోంది. వర్షం కురిసిన సమయంలో గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో వాటి లోతు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ రహదారిపై ప్రతిరోజూ ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. అయితే రహదారి దుస్థితి కారణంగా ప్రయాణ సమయం పెరగడంతో పాటు వాహనాల నిర్వహణ ఖర్చులు కూడా అధికమవుతున్నాయని వాపోతున్నారు. చిన్నపాటి అజాగ్రత్త జరిగినా ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొన్నదని స్థానికులు పేర్కొంటున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఘాజీపూర్ వంతెనకు ఇరువైపులా బీటీ రోడ్డు నిర్మాణంతో పాటు దెబ్బతిన్న రహదారికి మరమ్మత్తులు చేపట్టి వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బందులు తొలగించాలని ప్రజలు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**అత్యవసర సేవలకు తీవ్ర ఆటంకం.**

వర్షం కురిసిన ప్రతిసారీ ఘాజీపూర్ వంతెన వద్ద రహదారి పూర్తిగా బురదమయంగా మారుతోంది. దీంతో అత్యవసర సమయంలో అంబులెన్సులు కూడా వేగంగా వెళ్లలేకపోతున్నాయి. రోగులను ఆస్పత్రులకు తరలించడంలో జాప్యం ఏర్పడుతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ప్రతిరోజూ బురదలో ప్రయాణించాల్సి వస్తుండటంతో ఆలస్యంగా చేరుకోవడంతో పాటు ప్రమాదాల భయం వెంటాడుతోంది. వర్షం కురిసిన ప్రతిసారీ ఈ సమస్య మరింత తీవ్రమవుతోందని వాపోతున్నారు.

**వర్షం వస్తే బురద.. ఎండ వస్తే దుమ్ము.**

తాండూర్–కోటపల్లి ప్రధాన రహదారిలోని ఘాజీపూర్ వంతెన పరిసర ప్రాంతం ప్రజలకు నిత్య సమస్యగా మారింది. స్వల్పంగా వర్షం కురిసినా రహదారి బురదమయంగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఎండాకాలంలో అదే రహదారి దుమ్ముతో నిండిపోవడంతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వర్షం వస్తే బురదలో, ఎండ వస్తే దుమ్ములో ప్రయాణించాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఘాజీపూర్ వంతెనకు ఇరువైపులా బీటీ రోడ్డు నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రయాణికుల విజ్ఞప్తి.



# నూతన డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీకి గిరిజన సర్పంచుల సన్మానం

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్** కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ నూతన డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన జాదవ్ అంబాజీకి ఆదిమ గిరిజన సర్పంచులు ఘనంగా సన్మానం చేశారు. రాజ్ గోండ్ సేవా సమితి జాతీయ అధ్యక్షులు సిడాం అర్జు మాస్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాదవ్ అంబాజీకి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.గిరిజన సంక్షేమం కోసం సమర్థవంతంగా సేవలందించి, జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, గిరిజన విద్యాభివృద్ధికి విశేష కృషి చేయాలని పాల్గొన్నవారు ఆకాంక్షించారు. గిరిజన సంక్షేమం, విద్యాభివృద్ధి, ఆశ్రమ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తానని, ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో ప్రభుత్వ లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేస్తానని జాదవ్ అంబాజీ తెలిపారు.

## కన్నెపల్లిలో కొత్త వీధి దీపాల ఏర్పాటు

ప్రజా వాయిస్ ఆసిఫాబాద్ కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం కన్నెపల్లి గ్రామంలో సర్పంచ్ మోర్లె పార్వతి ఆధ్వర్యంలో సోమవారం కొత్త ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటు చేశారు. గ్రామంలోని ప్రధాన వీధులు, కాలనీల్లో తగిన వెలుతురు కల్పించడంతో రాత్రివేళల్లో ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు సురక్షితంగా రాకపోకలు సాగించే అవకాశం ఏర్పడింది.చీకటి వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలు, పాములు, విషపురుగుల బెడద వంటి అవాంఛనీయ ఘటనలను ఈ దీపాల ఏర్పాటు నివారిస్తుందని తెలిపారు. గ్రామ ప్రజల భద్రత, గ్రామాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ మరిన్ని అభివృద్ధి పనులు కొనసాగిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం సాధన కమిటీ సమావేశం విజయవంతం

- జాతీయ చైర్మన్ డా. చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి
- ప్రజల్లో అవగాహన, ప్రభుత్వ శాఖల్లో పారదర్శకతపై చర్చ
- సమాచార కమిషన్లో కమిటీకి ప్రాతినిధ్యం కల్పించాలని తీర్మానం
- ప్రతి గ్రామానికి ఆర్టీఐ ఉద్యమాన్ని తీసుకెళ్లాలని నిర్ణయం

**ప్రజా వాయిస్, హైదరాబాద్ :** సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే శక్తివంతమైన ఆయుధం. ఈ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రభుత్వం, సమాచార కమిషన్, ప్రజా సంఘాలు పరస్పర సహకారంతో పనిచేయాలి. ప్రజలకు సమాచారం వేగంగా, పారదర్శకంగా అందే విధంగా వ్యవస్థలో అవసరమైన మార్పులు తీసుకురావాలి అని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ చైర్మన్ డా. చంటి ముదిరాజ్ అన్నారు. హైదరాబాద్ మీర్ పేట్లోని తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో జాతీయ చైర్మన్ డా. చంటి ముదిరాజ్ అధ్యక్షతన, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి ఆధ్వర్యంలో జాతీయ, రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. చంటి ముదిరాజ్ మాట్లాడుతూ... సమాచార హక్కు చట్టం–2005 అమలు, సంస్థ విస్తరణ, ప్రజల్లో అవగాహన, ప్రభుత్వ శాఖల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపు వంటి అంశాలపై ప్రభుత్వం, సమాచార కమిషన్, ప్రజా సంఘాలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా సభ్యత్వ నమోదును వేగవంతం చేసి ప్రతి గ్రామానికి సమాచార హక్కు ఉద్యమాన్ని తీసుకెళ్తామని తెలిపారు. తెలంగాణ సమాచార కమిషన్ ఏర్పాటు చేసే సలహా, పర్యవేక్షణ, అధ్యయన కమిటీల్లో కమిటీకి ప్రాతినిధ్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించారు. సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, జాతీయ కార్యదర్శి తోట శ్రీనివాస్, సహాయ కార్యదర్శి అన్నవరం సందీప్ రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చింతల రాఘవేందర్, కో కన్వీనర్ గడప కృష్ణ, ఉపాధ్యక్షులు ప్రకాష్ పటేల్, అరవింద స్వామి, కార్యదర్శులు రావుల నవీన్ కుమార్, కేడెల ప్రసాద్, మడుపు వేణుగోపాల్ రావ్, సహాయ కార్యదర్శులు శ్రీకాంత్ రెడ్డి, శివకుమార్ గౌడ్,అశోక్ కుమార్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గుడ్డేటి ప్రవీణ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము అశోక్, నాగర్కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షుడు మంద సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కృషి

- ధరూర్ మండల ఎంపిడిఓ నర్సిములు
- అధికారులతో కలిసి హరిదాస్ పల్లి గ్రామాన్ని సందర్శించిన ఎంపిడిఓ

**ప్రజావాయిస్/వికారాబాద్:** గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడానికి ప్రత్యేక ప్రణాళికలతో నిరంతరం కృషి చేయడం జరుగుతుందని ధరూర్ మండల ఎంపిడిఓ నర్సింలు పేర్కొన్నారు.సోమవారం మండల పరిధిలోని హరిదాస్ పల్లి గ్రామ పంచాయతీని సందర్శించి అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు మరియు రికార్డులను పరిశీలించారు.రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత కల్పించడంతో గ్రామంలోని పూరి గుడిసె కలిగిన కుటుంబాన్ని నేరుగా వెళ్లి కలిసి గుడిసెను పరిశీలించడం జరిగింది.అనంతరం గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియ ను పరిశీలించడం జరిగింది.గ్రామ పంచాయతీ లో మౌలిక సదుపాయాలపై గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్ ను,కార్యదర్శి వెంకటయ్య లను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ సమగ్ర అభివృద్ధికి మండల పరిషత్ ప్రత్యేక కృషి చేస్తుందని ఎంపిడిఓ తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ అర్చన పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఓటే లక్ష్యం?




- పుల్కల్ మండలంలో 80 శాతం సర్ ప్రక్రియ పూర్తి...!
- తహసీల్దార్ కృష్ణ-

**ప్రజా వాయిస్ జన్గారెడ్డి :** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సర్ (ప్రత్యేక ఓటరు నమోదు) కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పుల్కల్ మండల తహసీల్దార్ కృష్ణ తెలియజేశారు. మండలంలోని బీఎల్ వోలు ఇంటింటికి వెళ్లి ఓటరు వివరాలను సేకరిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు. సెలవు రోజైన బిఎల్వోలు, పంచా యతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది ఇంటింటికి తిరిగి సర్ప్రక్రియను కొనసాగిస్తున్నారన్నారు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు నమోదుకాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే పుల్కల్ మండలంలో సుమారు 80 శాతం ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను మరో వారం, పదిరోజుల్లో పూర్తి చేయనున్నట్లు చెప్పారు. ప్రజలు బీఎల్వోలతో సహకరించి అవసరమైన వివరాలు అందించి,తమ పేర్లు ఓటరు జాబితాలో సరిగా నమోదయ్యేలా చూసుకోవాలని తహసీల్దార్ కృష్ణ విజ్ఞప్తి చేశారు.

# లింగ వివక్షత, లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టం పై అవగాహన

- చట్టం ఉల్లంగించిన వారి పై కఠిన చర్యలు
- హనుమకొండ డిఎంహెచ్ఓ డాక్టర్. ఏ. అప్పయ్య

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టం (PC&PNDT) జిల్లా స్థాయి అడ్వైసరీ కమిటీ సమావేశం సోమవారం హనుమకొండ కలెక్టరేట్ లోని డిఎంహెచ్ఓ కార్యాలయంలో నిర్వహించారు . ఈ సమావేశంలో సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ రిపోర్ట్ ప్రకారం జిల్లాలో తగ్గుతున్న బాలికల నిష్పత్తి, స్కానింగ్ సెంటర్ ల పర్యవేక్షణ, డెకాయ్ ఆపరేషన్ ల నిర్వహణ గురించి చర్చించి సభ్యుల సలహాలు సూచనలు తీసుకున్నారు.. లింగ వివక్షత,లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టం గురించి అవగాహన కార్యక్రమాలతో పాటు చట్టం ఉల్లంగించిన వారి పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డిఎంహెచ్ఓ తెలియ చేశారు. గతంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న 3 స్కానింగ్ మిషన్ లను సీజ్ చేయడం జరిగిందని ఎక్కడైనా మొబైల్ స్కానింగ్ మిషన్ లు గాని, లింగ నిర్ధారణ చేస్తున్నారని ఖచ్చితమైన సమాచారం ఉంటే 6300030940 కు తెలియ చేయాలన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ అధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో ఖచ్చితమైన సమాచారం అందించే వారికి రూ. 50000/- ప్రోత్సహకంగా ఇవ్వడానికి నిర్ణయించడం జరిగిందని గుర్తు చేశారు . క్షేత్ర స్థాయి లో పని చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది మరియు అంగన్వాడీ టీచర్ లు అప్పటికే ఒకరు లేదా ఇద్దరు ఆడ పిల్లలను కలిగి ఉన్న వారికి అవగాహన కలిగించడమే కాకుండా వారి పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు.మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్ సి(ఎంటిపి చట్టం )ప్రకారం గుర్తింపు పొందిన ఆసుపత్రులలో ప్రత్యేక పరిస్తితులలో చట్టం నియమాలకు లోబడి గర్భ



విచ్ఛిత్తికి అవకాశం ఉందని, పుట్ట బోయే బిడ్డ ఆడ పిల్ల అని తెలుసుకొని అబార్షన్ కు పాల్పడటం శిక్షార్హం అని. ముఖ్యంగా నాటు పద్ధతులు, స్వంత వైద్యం, అర్హత లేని వైద్యుల వద్ద కు వెళ్ళడం ద్వారా ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని వైద్యులు సూచించారు. ఈ సమావేశంలో జిఎంహెచ్ గైనకాలజిస్ట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మి , పరకాల CHC సూపరింటెండెంట్ డాక్టర్ వంశీ కృష్ణ, మాతా శిశు సంక్షేమ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రజిత, గైనకాలజిస్ట్ డాక్టర్ కవిత, డాక్టర్ రూబీన, లక్ష్యం స్వచ్ఛంద సంస్థ సీఈవో తాళ్లూరి లత, డాన్ బోస్కోస్వచ్ఛంధ సంస్థ .రాజు, పి. శారద, జిల్లా మాస్ మీడియా అధికారి వి. అశోక్ రెడ్డి, హెల్త్ సూపర్ వైసర్ పద్మజ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్టిపిపిలో సింగరేణి డైరెక్టర్ (ఈ&ఎం) ఎం. తిరుమల రావు పర్యటన

- తిరుమల రావు ముందుగా 1x800 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణ పనులను స్వయంగా పర్యవేక్షించారు

**ప్రజా వాయిస్/జైపూర్** జైపూర్ మండలం సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ప్రభుత్వ రంగ సంస్థ) ఆధ్వర్యంలో, ఎస్టిపిపిలో సింగరేణి డైరెక్టర్ (ఈ&ఎం) ఎం. తిరుమల రావు పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన 1x800 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించి, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ప్రభుత్వ రంగ సంస్థ) కమ్యూనికేషన్ సెల్, ఎస్టిపిపి ఏరియా ఆధ్వర్యంలో సింగరేణి డైరెక్టర్ (ఈ&ఎం) ఎం. తిరుమల రావు ఎస్టిపిపిలో పర్యటించారు. వీరికి ప్లాంట్ ఈడి సిహెచ్. చిరంజీవి , జిఎంలు ఎం నరసింహ రావు మరియు శ్రీ ఎం మదన్ మోహన్ గారు స్వాగతం పలికారు.డైరెక్టర్ (ఈ&ఎం) శ్రీ ఎం. తిరుమల రావు గారు ముందుగా 1x800 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణ పనులను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నిర్మిస్తున్న బాయిలర్ పనులు, ట్రాక్ హాపర్ పనులను పరిశీలించారు.అనంతరం వివిధ విభాగాల విభాగాధిపతులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో డైరెక్టర్ (ఈ&ఎం) ఎం. తిరుమల రావు గారు మాట్లాడుతూ, 1x800 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణ పనులు, బాయిలర్ పనులు, ట్రాక్ హాపర్ నిర్మాణ పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే ఉత్సాహంతో ప్లాంటు అధికారులు, ఉద్యోగులు



అందరూ సమిష్టిగా, కలిసి పనిచేస్తూ, నిర్ణీత సమయానికి మూడో యూనిట్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ప్లాంటు ఈడి సిహెచ్ చిరంజీవి , ఎస్టిపిపి జీఎం శ్రీ ఎం నరసింహ రావు , జీఎం(పిసిఎస్) శ్రీ మదన్ మోహన్ , సిఎంఓఎఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ డి పంతులా గారు, ఎజిఎం (ఈ & ఎం) సూర్యనారాయణ రాజు , 1x800MW ప్లాంట్ కోఆర్డినేటర్ ఎం.వి. వేణుగోపాల్ పర్సనల్ విభాగాధిపతి ఎస్వి రాజేశ్వర్ రావు , ఇతర అధికారులు మరియు ఉద్యోగులు పాల్గొన్నా



# కొత్తపేట రైతు వేదికలో విత్తన మేళా ప్రారంభం

**ప్రజా వాయిస్, బయ్యారం..** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల పరిధిలోని కొత్తపేట రైతు వేదికలో నేడు విత్తన మేళా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎల్నినో ప్రభావం, తక్కువ వర్షపాతం మరియు కరవు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించేందుకు పెసర, కంది, మినుము వంటి ఐడి (ID) పంటల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందని వాటిని రైతులు అందరూ వినియోగించగలరని సూచించారు.మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులు (AEOలు) విత్తన డీలర్లు రైతులు తదితరులు పాల్గొని రైతులకు అందుబాటులో ఉన్న విత్తనాల వివరాలు తెలియజేశారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ, రైతులు విత్తన మేళాను సందర్శించి తమ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన విత్తనాలను సకాలంలో పొందాలని కోరారు. ఎల్నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని వరి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా పెసర, మినుము, కంది వంటి ఆరుతడి పంటలను సాగు చేసి ప్రభుత్వ సూచనలను పాటించాలని రైతులను కోరారు..

# ఆగని రేషన్ మాఫియా



- లబ్ధిదారుల నుంచి సేకరణ.. క్వింటాళ్లుగా విక్రయం
- యథేచ్ఛగా మహారాష్ట్రకు తరలింపు
- పరోక్షంగా డీలర్లదే ప్రధాన పాత్ర ఉందని ఆరోపణలు
- పీడీ యాక్టుకు అవకాశం ఉన్నా దృష్టి సారించని అధికారులు
- కేసులతోనే సరి పెట్టడంతో మళ్లీ అదే దందా కొనసాగింపు
- వ్యాపారంగా మారిన దందా

ప్రజా వాయిస్ కొమురం భీం ఆసిఫాబాద్:కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ప్రజాపంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం వ్యాపారులు ఇప్పుడు అక్రమ బియ్యం రవాణాకు తెరలేపారు. రాజకీయ అండదండలతో వ్యవహారానికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. రేషన్‌బియ్యం సేకరణకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక ముఠాలు పని చేస్తున్నాయి. చైన్‌సిస్టంలా పని చేస్తూ ఒకరినుంచి ఒకరు ప్రజల నుంచి బియ్యం సేకరిస్తున్నారు. వాటిని పెద్దమొత్తంలో సేకరించి మహారాష్ట్రకు తరలిస్తూ సొమ్ము చేసు కుంటున్నారు. సేకరించిన బియ్యానికి కిలోకు రూ.10వరకు కమీషన్ మిగులు తుండటంతో చాలా మంది దీనిని వృత్తిగా మలుచుకుంటున్నారు. నిత్యం రవాణా జరుగుతూనే ఉన్నా ఎప్పుడో ఒక్కసారి పట్టుబడటం గమనార్హం.

### రవాణా చేస్తున్న ప్రధాన రహదారులు

ప్రభుత్వం సరఫరా చేసే బియ్యాన్ని తినేందుకు చాలా మంది ఇష్టపడటం లేదు. వీటిని వదిలి బహిరంగ మార్కెట్‌లో సన్నబియ్యం కొంటున్నారు. ఇంట్లో దొడ్డు బియ్యం తినడం లేదని మరికొంత మంది విక్రయిస్తున్నారు. సగటున కిలోకు రూ.10చొప్పున దళారులకు, ఇతరులకు అమ్ముతున్నారు. మరికొన్ని చోట్ల ఇంటింటికి తిరిగి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. సిర్పూర్ నియోజకవర్గంలోని మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న బెజ్జూరు, కౌటాల, సిర్పూర్(టి), చింతలమానేపల్లి తదితర మండలాల్లో రేషన్ దందా జోరుగా కొనసాగుతోంది. ఆయా మండలాల్లో సేకరించిన రేషన్ బియ్యాన్ని గుట్టుచప్పుడు కాకుండా మహారాష్ట్రకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇక్కడి బియ్యానికి మహారాష్ట్రలో మంచి డిమాండ్ ఉండటంతో కొంతమంది ఇదే పనిగా పెట్టుకొని బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తున్నారు. ఇక్కడ కిలోకు రూ.10నుంచి 15వరకు కొనుక్కొని అక్కడ కిలోకు రూ.20నుంచి 25వరకు అమ్ముకుంటున్నారు. కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూరు మండలాల సరిహద్దున గల ప్రాణహిత నదిపై గూడెం వద్ద వంతెన పూర్తి కావడంతో అక్రమార్కులకు ఇది రాచమార్గంగా మారింది. ప్రతి నిత్యం రాత్రి వేళల్లో ద్విచక్రవాహనాలు, బొలేరో, ఆటోల్లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా మహారాష్ట్రకు తరలించి లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. ఇక సిర్పూర్ వంటి మండలం నుంచి రైళ్ల ద్వారా, వాహనాల ద్వారా పొడుస ప్రాంతానికి బియ్యాన్ని చేర్చుతూ సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులు తరచూ దాడులు చేస్తున్నా అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. కొంతమంది రేషన్ ఇచ్చే డీలర్ల వద్ద నుంచే బియ్యాన్ని సేకరిస్తున్నట్లు సమాచారం. డీలర్లు బియ్యం పంపిణీ చేస్తున్న సమయంలోనే దళారులు లబ్ధిదారుల నుంచి అక్కడే కొనుగోలు చేస్తున్నారు. కొంత మంది రేషన్ డీలర్లు కూడా దళారులతో చేతులు కలిపి ఈ వ్యవహారం నిర్వహిస్తున్నట్లు సమాచారం. డీలర్లు బయటకు రాకుండా ఉండేందుకు దళారుల చేత బియ్యాన్ని సేకరించి వచ్చిన ఆదాయంలో సమంగా పంచుకుంటున్నారని బాహాటంగానే ఆరోపణలు ఉన్నాయి.

### తూతూ మంత్రంగా ధర్యాప్తు..

జిల్లాలో రోజుల వ్యవధిలోనే అధికారులు అక్రమంగా నిల్వ ఉంచిన, తరలి స్తున్న బియ్యాన్ని పట్టుకుంటున్నారు. కానీ వాటి మూలాల్లోకి మాత్రం వెళ్లడం లేదు. పట్టుబడిన వ్యక్తులు ఎక్కడి నుంచి వాటిని సేకరించారు. ఎన్ని నెలల నుంచి వ్యాపారం సాగుతోంది. తదితర అంశాలపై లోతుగా దర్యాప్తు జరగకపోవడం వల్లనే కేసులు నమోదైనా మళ్లీ ఇదే దందా సాగించడమో లేదంటే వారి ప్రతినిధులను ఈ వ్యాపారంలో దింపి వెనుక నుంచి నడిపించడం లాంటివి చేస్తున్నారని తెలుస్తోంది. దొరికిన బియ్యానికి లెక్కలు అడిగి చర్యలు తీసుకుంటున్నారు. తప్పితే వారి వ్యాపార చరిత్రపై ఆరా తీయడం లేదు. ఇప్పటికైనా అధికారులు బియ్యం అక్రమ రవాణాపై లోతుగా విచారణ జరపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### శిక్షలు ఇలా..

రేషన్ బియ్యం అక్రమ వ్యాపారులపై అత్యవసర సరుకుల చట్టంలోని 6ఎ సెక్షన్ కింద కేసు నమోదు చేస్తున్నారు. చట్టంలో ఈ సెక్షన్ కింద అక్రమార్కులపై జరిమానా, శిక్షలను నిర్దేశిస్తోంది. మొదటిసారి అక్రమంగా సరుకులు తరలిస్తే వారికి మూడు నెలల నుంచి ఏడేళ్ల వరకు శిక్ష విధించే అవకాశం ఉంది. జైలు శిక్షతో పాటు జరిమానా విధించవచ్చు. రెండోసారి పట్టుబడితే ఆరు నెలల నుంచి ఏడేళ్ల వరకు జైలు శిక్ష విధించడంతో పాటు జరిమానా విధించవచ్చు. అక్రమ వ్యాపారానికి అవకాశం కల్పించిన, ప్రేరేపించినా శిక్షించే అవకాశం ఉంది. పట్టుబడిన సరుకును సక్రమమే అంటూ లెక్కలు చేపించే ప్రయత్నం చేసిన వారికి స ఐతం శిక్ష ఉంటుంది. రైస్‌మిల్లర్లు రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసిన కస్టమ్ రైస్‌కు తరలించినట్టు రుజువైన పక్షంలో ఐదేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉంది.

### రేషన్ బియ్యంపై పీడీ యాక్టు

వాస్తవానికి బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్న అక్రమార్కులు, వారి నుంచి వాటిని కొనుగోలు చేస్తున్న వ్యాపారులు మూడు సార్లు పట్టుబడితే పీడీ యాక్టు కింద నమోదు చేయాలి. అక్రమార్కులు రేషన్ బియ్యం పట్టుబడినప్పుడు చాలా తెలివిగా తప్పించుకుంటున్నారు. పట్టుబడిన సమయంలో తమ పేర్లు లేకుండా జాగ్రత్త పడుతున్నారు. ఒకటి, రెండుసార్లు పట్టుబడినప్పుడు సెక్షన్ 6ఎ కింద కేసు నమోదవుతుండడంతో తేలిగ్గానే బయటపడుతున్నారు. మూడోసారి పట్టుపడకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరిస్తున్నారు. తమ చేతికి మట్టి అంటకుండా జాగ్రత్త పడుతున్నారు.

### చాకచక్యంగా.. మార్గాలు

భారీ ఎత్తున బియ్యం పట్టుబడిన సమయంలో అక్రమార్కులు కోర్టును ఆశ్రయిస్తున్నారు. అధికారులు పట్టుకున్న బియ్యం రేషన్‌వి కాదంటూ వాదిస్తున్నారు. రేషన్ బియ్యానికి, సాధారణ బియ్యానికి తేడా లేకపోవడంతో అధికారులు కోర్టులో రేషన్ బియ్యాన్ని నిరూపించలేకపోతున్నారు. ఫలితంగా అక్రమార్కులు కేసుల నుంచి బయటపడి మళ్లీ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. వ్యాపారులు బియ్యం తరలింపునకు ఉపయోగించే వాహనాలను తమ పేరుపై లేకుండా జాగ్రత్త పడుతున్నారు. వాహనాలను పట్టుకున్న సమయంలో వాహనాలను నిలిపి పరారవుతున్నారు.

### అధికారుల పై దాడి విధులకు ఆటంకం

సిర్పూర్ (టి) రైల్వే స్టేషన్‌లో పీడీఎస్ (PDS) బియ్యం అక్రమ రవాణాను తనిఖీ చేస్తున్న సివిల్ సప్లైస్ అధికారులపై స్థానికుడు దేవాజీ, అతని భార్య మరియు మరికొందరు అధికారులను దుర్భాషలాడి, బెదిరించి, స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలను బలవంతంగా సింగరేణి ఎక్స్‌ప్రెస్ రైలులో ఎక్కించి పరారయ్యారు.ఈ ఘటనపై ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించడం మరియు అక్రమ రవాణా కింద సిర్పూర్ (టి) పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పీడీఎస్ బియ్యం అక్రమాలు లేదా అధికారుల విధులకు ఆటంకం కలిపితే చట్టరీత్యా కఠిన శిక్ష తప్పదని హెచ్చరించారు.

## అర ఎకరం భూమే.. రైతు ప్రాణం తీసింది

- భూమి కొనుగోలుకు చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపం
- గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చికిత్స పొందుతూ రైతు మృతి
- నిడమనూరు మండలం ఊట్కూరు గ్రామంలో విషాదం



**ప్రజా వాయిస్,నిడమనూరు:** అప్పుల ఊబిలో చిక్కుకున్న మరో రైతు ప్రాణాలు కోల్పోయాడు. అర ఎకరం వ్యవసాయ భూమిని కొనుగోలు చేసేందుకు చేసిన అప్పులు తీర్చలేక తీవ్ర మనస్తాపానికి గురైన రైతు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రెండు రోజుల పాటు మృత్యువుతో పోరాడి చివరకు చికిత్స పొందుతూ కన్నుమూశాడు. ఈ విషాద ఘటన నల్గొండ జిల్లా నిడమనూరు మండలం ఊట్కూరు గ్రామంలో చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన కొంపెల్లి సైదులు (50) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇటీవల అర ఎకరం వ్యవసాయ భూమిని అప్పులు చేసి కొనుగోలు చేశాడు. అయితే పెరిగిన రుణభారం, ఆర్థిక ఇబ్బందులు ఆయనను తీవ్ర మనోవేదనకు గురి చేశాయి. అప్పులు ఎలా తీర్చాలో తెలియక కొంతకాలంగా మానసిక ఆందోళనతో మద్యం సేవిస్తూ ఇంటి వద్దే ఉంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ నెల 25వ తేదీన ఆయన భార్య కొంపెల్లి మంగమ్మ కూలీ పనులకు వెళ్లగా, సైదులు ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన ఆమెకు సైదులు గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో కనిపించాడు. నోటి నుంచి నురుగు రావడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెంటనే 108 అంబులెన్స్‌లో నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించి సోమవారం (జూలై 27) ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు.మృతుడి భార్య మంగమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో, అప్పులు చేసి కొనుగోలు చేసిన భూమికి సంబంధించిన రుణాలు తీర్చలేక మనస్తాపంతోనే తన భర్త ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని, ఆయన మరణంపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.



## వర్షాకాల వ్యాధుల నియంత్రణకు సమన్వయంతో పనిచేయాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్

**ప్రజా వాయిస్ /మంచిర్యాల** మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్ అధ్యక్షతన జిల్లాలో అమలవుతున్న వైద్య, ఆరోగ్య కార్యక్రమాలపై వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డా. నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వర్షాకాలంలో అంటు, కీటక జన్య వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున మండల స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుని నివారణ చర్యలను ముమ్మరం చేయాలని ఆదేశించారు.మాతా–శిశు సంరక్షణ కార్యక్రమాన్ని శాతం వంద అమలు చేయాలని, గర్భిణుల నమోదు, అవసరమైన వైద్య పరీక్షలు, హైరిస్క్ గర్భిణులను గుర్తించి ప్రత్యేక వైద్య సేవలు అందించాలని సూచించారు. మాతా శిశు సంరక్షణ పోర్టల్, యూ–విన్ పోర్టల్‌లలో నమోదులను పూర్తి స్థాయిలో నిర్వహించాలని తెలిపారు. అలాగే జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా క్షయవ్యాధి బాధితులను గుర్తించి సకాలంలో చికిత్స అందించాలని, ఫోర్ ట్యూబ్ ఎక్స్‌రే సేవలను సమర్థంగా వినియోగించాలని సూచించారు. మారుమూల గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్య సేవలను చేరవేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఆశా కార్యకర్తలు ప్రతిరోజూ తమ పరిధిలోని గ్రామాలను సందర్శిస్తూ గ్రామపంచాయతీ ప్రతినిధులు, సిబ్బందితో కలిసి పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి ఇంటిలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. మారుమూల ప్రాంతాల్లోని గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని రోజువారీగా పర్యవేక్షించాలని పేర్కొన్నారు.30 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరికి అసంక్రమణ వ్యాధుల స్క్రీనింగ్ నిర్వహించి మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులను గుర్తించి అవసరమైన మందులు అందించాలని ఆదేశించారు. టెలి–మనస్ కార్యక్రమాన్ని శాతం వంద పూర్తి చేయడంతో పాటు మానసిక ఆరోగ్యంపై పాఠశాలలు, ముఖ్యంగా రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వైద్యులు, సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బంది పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అవసరమైన ఆరోగ్య సూచనలు అందించాలని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. సుధాకర్ నాయక్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. అరుణశ్రీ, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, సీహెచ్‌ఓ కాకిరాల వెంకటేశ్వర్లు, డీడీఎం ప్రవళిక, జిల్లాలోని వైద్యాధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ పై ప్రత్యేక దృష్టి

- గడపగడపకు ఓటరు నమోదు
- ప్రభుత్వ విప్ విప్ విజయరమణరావు



**ప్రజా వాయిస్, పెద్దపల్లి :**పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పాల్గొన్నారు. అనంతరం కౌన్సిలర్లు, వార్డ్ అధికారులు, బూత్ లెవల్ అధికారులు, మెప్మా ఆర్పీలతో ఎస్ఐఆర్ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా విజయరమణరావు మాట్లాడు తూ ప్రతి వార్డులో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రత్యేక శ్రద్ధతో చేపట్టి గడపగడపకు వెళ్లి అర్హులైన ప్రతి ఓటరును ఓటరు జాబితాలో చేర్చాలని సూచించారు. అవసరమైతే ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే జెండా చౌరస్తా నుంచి మసీదు చౌరస్తా వరకు 300 మీటర్ల ప్రధాన రోడ్డును 55 అడుగుల వెడల్పు చేయనున్నట్లు తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలకు పార్టీలకు అతీతంగా సహకరించాలని కోరారు.అంతకుముందు మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.



## బారీ వర్షానికి కూలిన ఇల్లు

- బాధిత కుటుంబానికి మున్సిపల్ వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి బరోసా

**ప్రజావాయిస్/వికారాబాద్:**గత ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వికారాబాద్ మున్సిపల్ లోని గిరిగెట్ పల్లి 10వ వార్డులో ఓ ఇల్లు కూలిపోయింది.విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్ధ సుధాకర్ రెడ్డి వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. బాధిత కుటుంబానికి నుండి తక్షణ సహాయం అందించేందుకు ఎప్పుడు ముందుంటామని బరోసా కల్పించారు.ఆయన వెంట స్థానిక నాయకులు రెడ్యా నాయక్, బుచ్చయ్య , నరసింహులు, రెడ్డి శేఖర్ వద్దేశీను, కురువ వెంకటయ్యలు ఉన్నారు.

## తోగూడెం అక్రమ మైనింగ్‌పై తక్షణమే సమగ్ర విచారణ జరపాలి

- అక్రమ మైనింగ్ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- సేవాలాల్ సేన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భద్రాద్రి జిల్లా కలెక్టరేట్ ముట్టడి
- ప్రజావాణిలో కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేసిన సేవాలాల్ సేన
- జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్




**ప్రజా వాయిస్ భద్రాద్రి కొత్తగూడెం** జిల్లా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం తోగూడెం గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతున్న అక్రమ కొనసాగుతున్న మైనింగ్ వ్యవహారంపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం నాడు జిల్లా కలెక్టరేట్ ను భారీ ఎత్తున ముట్టడించారు. అనంతరం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కలిసి అక్రమ మైనింగ్‌కు సంబంధించిన సమగ్ర విచారణ జరిపించాలంటూ జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి భూక్య శ్రీను నాయక్ మాట్లాడుతూ 29-06-2026న ఇదే అంశంపై జిల్లా కలెక్టర్‌కు సమగ్ర వినతిపత్రం సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజాస్వామ్య పద్ధతిలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించాల్సి వచ్చిందని తెలిపారు.తోగూడెం గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న అక్రమ మైనింగ్ కారణంగా ప్రభుత్వ ఖజానాకు వందల కోట్ల రూపాయల నష్టం జరుగుతోందని,గిరిజనుల హక్కులు ఉల్లంఘించబడుతున్నాయని, సహజ వనరులు మరియు పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆయన పేర్కొన్నారు.జిల్లా మైనింగ్ శాఖ అధికారులు తోగూడెం ప్రాంతంలోని క్వారీలను ఇప్పటికే మూడుసార్లు సీజ్ చేశామని ప్రకటించడం ద్వారా అక్కడ అక్రమ మైనింగ్ జరిగినట్లు వారే అంగీకరించినట్లేనని అన్నారు. అయినప్పటికీ ప్రతి సారి కొద్దిరోజుల పాటు మాత్రమే సీజ్ చేసి తిరిగి అక్రమ తవ్వకాలు కొనసాగేందుకు అవకాశం కల్పించడం వెనుక ఉన్న కారణాలను వెలికితీయాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.ఎనిమిది, తొమ్మిది నెలల విరామాలతో నామమాత్రపు చర్యలు తీసుకోవడం, ప్రజలు ఫిర్యాదు చేసినప్పుడు మాత్రమే తాత్కాలిక చర్యలు చేపట్టడం, అనంతరం మళ్లీ అక్రమ మైనింగ్‌కు అవకాశం కల్పించడం వల్ల ప్రభుత్వానికి భారీ ఆదాయ నష్టం జరిగిందని ఆరోపించారు.అక్కడ జరిగిన తవ్వకాల అసలు పరిమాణాన్ని నమోదు చేయకుండా తక్కువగా చూపించి ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీని తగ్గించడం ద్వారా ప్రజాధనాన్ని దోచుకున్నారని పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం కింద కోరిన వివరాలకు వాస్తవాలను దాచిపెట్టి అన్ని క్వారీలకు అనుమతులు ఉన్నట్లు తప్పుడు సమాచారం ఇవ్వడం అత్యంత బాధ్యతారాహిత్యమని, దీనిపై కూడా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.పర్యావరణ అనుమతులు, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలు మరియు ఇతర చట్టాలను ఉల్లంఘిస్తూ అక్రమ మైనింగ్ కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు.ఈ వ్యవహారంపై స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ జరిపి జిల్లా మైనింగ్ శాఖ అధికారుల పాత్రను కూడా విచారించాలని, అక్రమ మైనింగ్ నిర్వహించిన వారితో పాటు సహకరించిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సమర్పించిన వినతిపత్రంలో డిమాండ్ చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ తక్షణ చర్యలు తీసుకొని గిరిజనుల హక్కులు, సహజ వనరులు, పర్యావరణం మరియు ప్రభుత్వ ఆదాయాన్ని పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమానికి భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు సంపూర్ణ మద్దతును తెలియజేశారు.ఈ కార్యక్రమంలోసేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు బోడ రమేష్ నాయక్, జిల్లా అధికార ప్రతినిధి బానోతు నాగరాజు నాయక్, జిల్లా కార్యదర్శి బాదావత్ సురేష్ నాయక్, జిల్లా జరపల లాలు నాయక్, బట్టు హుస్సేన్ నాయక్,బోడ రమేష్ నాయక్, బోడ సీతారాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు మారినా... పేర్లు మాత్రం మారవా...??

**ప్రజా వాయిస్ హన్మకొండ** /దామెర హనుమకొండ జిల్లా దామెర మండలం లోని తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు బదిలీ అవుతూ కొత్త అధికారులు బాధ్యతలు స్వీకరించి నెలలు గడుస్తున్న కార్యాలయంలోని , సమాచార హక్కు చట్టం బోర్డుపై బదిలీ అయినా అధికారి పేరు. ఇప్పటికీ పాత అధికారుల పేర్లే కొనసాగుతున్నాయని ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు .ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం కోసం అధికారుల వివరాలు ఎప్పటికప్పుడు నవీకరించడం అవసరం. అయితే సంబంధిత అధికారులు మారినప్పటికీ, పాత పేర్లు కొనసాగడం వల్ల ప్రజలకు సరైన అధికారిని గుర్తించడం కష్టంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు.ఈ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే పరిశీలించి, కార్యాలయంలోని సమాచార హక్కు చట్టం బోర్డుపై ప్రస్తుత అధికారుల వివరాలతో కూడిన బోర్డును ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. తాసిల్ అధికారుల పనితీరును తప్పుపడుతూ చిన్న నిర్లక్ష్యంగా కనిపించినా, ప్రజలకు సరైన సేవలు అందించడంలో ఇది ఇబ్బందులకు దారితీస్తుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

